పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# హైదరాబాద్‌లో వినాయకుడి విగ్రహంపై హెలికాప్టర్‌తో పూలవర్షం..!



**హైదరాబాద్ పెన్ పవర్:** వినాయక నిమజ్జన వేడుకల్లో అపురూప దృశ్యం ఆవిష్కృతమైంది. గణపతి బొప్పా మోరియా అంటూ భక్తుల జయజయధ్వానాల మధ్య వినాయకుడి విగ్రహంపై హెలికాప్టర్‌లో నుంచి నిర్వాహకులు పూల వర్షం కురిపించారు. మేడ్చల్ జిల్లా దుండిగల్ సర్కిల్‌లోని బౌరంపేటలో సారుగారి ధర్మారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఈ వేడుక జరిగింది. స్థానిక హనుమాన్ దేవాలయంలో ప్రతిష్ఠించిన గణేశుడి విగ్రహాన్ని సమీప మైదానంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపైకి తీసుకొచ్చారు. సాయంత్రం 4 గంటల సమయంలో ఆకాశంలో నుంచి హెలికాప్టర్ ద్వారా విఘ్నేశ్వరుడి విగ్రహంపై పూల వర్షం కురిపించారు. ఈ దృశ్యాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా స్వామివారి విగ్రహంపై పూలు జాలువారే దృశ్యాన్ని తమ ఫోన్లలో చిత్రీకరించారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథులుగా హాజరై ఈ కార్యక్రమాన్ని వీక్షించారు.



# ఇంటి వద్దకే 'మీ సేవ'..

## సర్వీసు ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంటి వద్దకే మీ సేవ సర్వీసులు పేరిట మీ సేవ డోర్ డెలివరీ సర్వీసెస్‌ను ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. హైదరాబాద్ ఆర్టీసీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీనికి సంబంధించిన పోర్టల్‌ను శ్రీధర్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు. 1100 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసినా లేదా మీసేవ పోర్టల్ ద్వారా స్లాట్‌ను బుక్‌చేసుకుంటే.. మీసేవ ఎగ్జిక్యూటివ్ ఇంటి వద్దకే వస్తారని పేర్కొన్నారు. ఇంటివద్దనే.. జనన లేదా మరణ

-5 లో

# కొమురవెల్లిలో ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు..



సుధీర్ మంకాల.. సీనియర్ జర్నలిస్టు..

- గణనాథుని చేతిలో 9 రోజులు పూజలు అందుకున్న లడ్డూకు వేలంపాట..
- రూ.23,116 లకు సుధీర్ మంకాల దంపతుల కైవసం..
- సుధీర్ మంకాల దంపతులకు దక్కిన గణనాథుని ప్రసాదం..

- తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు..
- సతీసమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించిన సీనియర్ పాత్రికేయుడు సుధీర్ మంకాల..
- వేలంలో పొందిన లడ్డూను స్వామివారి ఆశీస్సులుగా భావిస్తున్నట్లు వెల్లడి..
- భక్తుల సందడితో ఘనంగా నిర్వహించిన నిమజ్జన వేడుకలు..
- అంగరంగవైభవంగా ఆ గణేష్ మహరాజ్ ఊరేగింపులో భక్తుల నృత్యాలు..

-4 లో

# రిమ్స్‌లో పసికందుల మృత్యుఘోష.. ఐదుకు చేరిన మృతులు

## రిమ్స్‌లో పసికందుల మృత్యుఘోష.. ఐదుకు చేరిన మృతులు



**ఆదిలాబాద్ పెన్ పవర్:** అమ్మ ఒడిలో ఉండాల్సిన పసికందులు.. ప్రాణాలతో పోరాడుతూ చివరకు కన్నుమూయడంతో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి. బిడ్డకు వైద్యం అందుతుందన్న ఆశతో రిమ్స్‌కు వచ్చిన తల్లిదండ్రులకు కన్నీళ్లే మిగిలాయి.రెక్కలు కూడా రాని ఆ పసికందులు ప్రాణాల కోసం పోరాడుతున్న సమయంలో ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూలో వార్డులో ఒక్కసారిగా చెలరేగిన మంటలు,కమ్ముకున్న పొగలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి.సోమవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో తొలుత ముగ్గురు నవజాత శిశువులు మృతి చెందగా.. తాజాగా బుధవారం మరో ఇద్దరు శిశువులు మృతి చెందారు. దీంతో ఈ ఘటనలో మృతి చెందిన చిన్నారుల సంఖ్య ఐదుకు చేరింది. ప్రమాదం అనంతరం పొగ పీల్చిన పలువురు చిన్నారులను రిమ్స్‌లోని ఇతర విభాగాలతో పాటు

-5 లో

# యాదాద్రి థర్మల్ ప్లాంట్‌పై సీఎం రేవంత్, భట్టి సమీక్ష..

## బొగ్గు కొరతపై అధికారుల నిలదీత



**హైదరాబాద్ పెన్ పవర్:** విద్యుత్ శాఖ అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి ,డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ఇవాళ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం లో ఉత్పత్తి పరిస్థితి, బొగ్గు కొరత, గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల రాష్ట్రంపై పడుతున్న ఆర్థిక భారంపై వారు అధికారులను నిలదీశారు. ప్లాంట్ నిర్మాణం, బొగ్గు లభ్యతకు సంబంధించి పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

**ప్లాంట్ నిర్మాణం, బొగ్గు లభ్యతపై సీఎం నిలదీత**

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో విద్యుత్ ఉత్పత్తికి జీ-9 రకం బొగ్గు అవసరమని అధికారులు తెలిపారు. అయితే సింగరేణి లో జీ-9 బొగ్గు బ్లాకులు లేవని స్పష్టం చేశారు. సింగరేణిలో జీ-9 బొగ్గు బ్లాకులు అందుబాటులో లేనప్పుడు ప్లాంట్‌ను ఎలా నిర్మించారని, గనుల ప్రాంతానికి దూరంగా ఎందుకు ఏర్పాటు చేశారని సీఎం రేవంత్ అధికారులను ప్రశ్నించారు. యాదాద్రికి బొగ్గు సరఫరా కారణంగా రాష్ట్రంపై రూ.40 వేల కోట్ల అదనపు భారం పడుతోందని పేర్కొన్నారు. కేవలం రాజకీయ కారణాల వల్లే ప్లాంట్‌ను దూర ప్రాంతంలో నిర్మించారని వెల్లడించారు. గత ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడం వల్లే సింగరేణి జీ-9 బొగ్గును సరఫరా చేయలేకపోయిందని, అప్పట్లో సింగరేణిలో 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయని అధికారులు వివరించారు.

**మహానది, కోల్ ఇండియా నుంచి కొనుగోలుకు ఆదేశాలు**

అయితే, జీ-9 బొగ్గు లభించే ప్రత్యామ్నాయ అవకాశాలపై సీఎం రేవంత్, భట్టి విక్రమార్క వివరాలు ఆరా తీశారు. మహానది, కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్‌రెడ్డి (ఖఅంష్ట్రుఅ =వ\సఎ)తో వెంటనే చర్చించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు సూచించారు. మరోవైపు, దసరాలోపు యాదాద్రి ప్లాంట్‌లో పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలని సీఎ రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# భద్రాద్రి జిల్లాలో టొర్నాడో విధ్వంసం..

## గాలికి కొట్టుకుపోయిన ఆటోలు



**హైదరాబాద్ పెన్ పవర్:** భద్రాద్రి జిల్లాల్లో టొర్నడో విధ్వంసం సృష్టించింది. మోరంపల్లి బంజరు భూముల్లో భారీ చెట్లు, విద్యుత్ స్థంభాలు కూలిపోయాయి. తీవ్రమైన గాలులకు ఇంటిపై కప్పులు సైతం ఎగిరిపోయాయి. స్థంభాల విద్యుత్ తీగలు తెగిపడటంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. గాలి బీభత్సానికి రోడ్డుపై ఉన్న ఆటోలు సైతం కొట్టుకుపోయాయి. పలు ఇళ్లపై చెట్లు విరిగిపడటంతో ఆస్తినష్టం జరిగినట్టు నివేదికలు చెబుతున్నాయి.విద్యుత్ స్తంభాలు విరిగిపడటం, తీగలు తెగిపోవడంతో గ్రామంలో విద్యుత్ సరఫరాకు సైతం అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి తమకు సాయం అందించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం టోర్నడో విధ్వంసానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వీడియోలు భయానకంగా కనిపిస్తుండటంతో నెటిజన్లు సైతం షాక్ అవుతున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి గాలులు రాలేదని జిల్లా వాసులు చెబుతున్నారు.

# రాజకీయాల పరమార్థం నిస్వార్థ ప్రజాసేవే..



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

**హైదరాబాద్ పెన్ పవర్:** రాజకీయాలు అంటే కేవలం ఎన్నికలు, ఓట్లు మాత్రమే కాదని, సమాజ హితం కోసం నిస్వార్థ సేవ చేయడమే ప్రజాప్రతినిధికి నిజమైన సంతృప్తినిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోడీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని, సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో బుధవారం నాగోల్‌లో భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాంచందర్ రావు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, తానూ రక్తదానం చేసి యువతలో ఉత్సాహం నింపారు. మోడీని ఆదర్శంగా తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా 25 వేల మంది యువతీయువకులు రక్తదానం చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందే తదితర నాయకులు పాల్గొన్నారు.

# కొమురవెల్లిలో ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు..


సుధీర్ మంకాల.. సీనియర్ జర్నలిస్టు..

- గణనాథుని చేతిలో 9 రోజులు పూజలు అందుకున్న లడ్డూకు వేలంపాట..
- రూ.23,116 లకు సుధీర్ మంకాల దంపతుల కైవసం..
- సుధీర్ మంకాల దంపతులకు దక్కిన గణనాథుని ప్రసాదం..

- తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు..
- సతీసమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించిన సీనియర్ పాత్రికేయుడు సుధీర్ మంకాల..
- వేలంలో పొందిన లడ్డూను స్వామివారి ఆశీస్సులుగా భావిస్తున్నట్లు వెల్లడి..
- భక్తుల సందడితో ఘనంగా నిర్వహించిన నిమజ్జన వేడుకలు..
- అంగరంగవైభవంగా ఆ గణేష్ మహరాజ్ ఊరేగింపులో భక్తుల నృత్యాలు..


లడ్డూ ప్రసాదాన్ని కైవసం చేసుకున్న సుధీర్ మంకాల దంపతులకు శాలువాతో సత్కారం..


ఆ గణేషుని సన్నిధిలో సుధీర్ మంకాల దంపతులు..

కొమురవెల్లి మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి.. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథుడి లడ్డూ ప్రసాదానికి ఉత్సాహభరితంగా వేలంపాట నిర్వహించారు.. వేలంపాటలో సీనియర్ జర్నలిస్టు, కుత్బుల్లాపూర్ మాజీ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సుధీర్ మంకాల దంపతులు రూ.23,116కు లడ్డూ ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. మొదటి రోజు నుంచి గణనాథుడికి పూజలు నిర్వహించిన మంకాల దంపతులు, తొమ్మిదో రోజుసతీసమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.. తమకు లభించిన లడ్డూ ప్రసాదాన్ని స్వామివారి ఆశీస్సులుగా భావిస్తున్నామని సుధీర్ మంకాల తెలిపారు. గణనాథుని కృపతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ నిమజ్జన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనంగా వీడ్కోలు పలికారు..
**సిద్దిపేట/కొమురవెల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**

## మరపురాని అనుభూతి..

గణనాథుని నిమజ్జనాన్ని పురస్కరించుకుని నిర్వహించిన లడ్డూ వేలంపాటలో ప్రసాదాన్ని దక్కించుకోవడం తమ కుటుంబానికి మరపురాని అనుభూతిగా, తీపి జ్ఞాపకంగా నిలిచిందని సుధీర్ మంకాల పేర్కొన్నారు. గణనాథుని ఆశీస్సులతో అందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వినాయక ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు కొనసాగాయి. నిమజ్జన వేడుకల సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. లడ్డూ వేలంపాటలో రూ.23,116 ధర పలకడం ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు..

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన, గణనాథుడి వద్ద తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న లడ్డూ ప్రసాదానికి భక్తుల మధ్య ఉత్సాహభరితంగా వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో సీనియర్ పాత్రికేయుడు, కుత్బుల్లాపూర్ మాజీ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సుధీర్ మంకాల, ఆయన సతీమణి రూ.23,116కు లడ్డూ ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు.. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథుని లడ్డూ ప్రసాదం తమకు లభించడం ఎంతో సంతోషంగా ఉందని సుధీర్ మంకాల తెలిపారు. దీనిని సాధారణ ప్రసాదంగా కాకుండా, గణనాథుని ఆశీస్సులుగా భావిస్తున్నామని పేర్కొన్నారు.. గణనాథుని కృప ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఈ సందర్భంగా భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు.. వినాయక చవితి ఉత్సవాల ప్రారంభం నుంచే గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ వచ్చామని సుధీర్ మంకాల తెలిపారు. మొదటి రోజే స్వామివారిని దర్శించుకుని పూజలు ప్రారంభించామని, తొమ్మిదో రోజు కూడా సతీసమేతంగా గణనాథుడికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు చెప్పారు.. తొమ్మిది రోజుల పాటు భక్తులు, స్థానిక ప్రజలతో కలిసి, వినాయకుని వద్ద ఆధ్యాత్మిక వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు..



కొమురవెల్లిలో నిమజ్జనానికి ఊరేగింపుగా బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న గణనాథుడు..

---

# వినాయక మండపాల్లో..! వారాల వినోద్ సందడి..



- పలు వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు..
- అన్న ప్రసాద కార్యక్రమాల్లో పాల్గొన్న వారాల వినోద్..
- భక్తులతో కలిసి ఉత్సవాల్లో మమేకమై
- కాలనీల్లో వినాయక చవితి వేడుకలు..
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు, బస్తీ వాసులు..
- పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, యువత, కార్యకర్తలు..





సాయిబాబా నగర్ 292 డివిజన్ పరిధిలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. పలు కాలనీల్లోని వినాయక మండపాలను సందర్శించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్ ప్రత్యేక పూజల్లో పాల్గొని, అన్న ప్రసాద కార్యక్రమాల్లో భక్తులతో మమేకమయ్యారు.. **కుత్బుల్లాపూర్, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**

292 డివిజన్ సాయిబాబా నగర్ పరిధిలోని పలు కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్ పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆయా మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, వినాయకుడి ఆశీస్సులు పొందారు.. అనంతరం వారాల వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న ప్రసాద కార్యక్రమాల్లో ఆయన పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించారు. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని కాలనీల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. ప్రజలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలు విజయవంతంగా మిగిసాయని సంతోషం వ్యక్తం చేశారు.. వినాయక మండపాల వద్ద భక్తులు, కాలనీ వాసులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న వారాల వినోద్ కుమార్‌ను నిర్వాహకులు, స్థానికులు అభినందించారు. ఉత్సవాల సందర్భంగా
కాలనీల్లో భక్తి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆయా కాలనీలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాజ్ కుమార్ ముదిరాజ్, జై భీమ్ నగర్ ప్రెసిడెంట్ జి. భాస్కర్, డి. ప్రసాద్, రమణ, వెంకట్, రాములు, మోహన్ రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ సాయి యాదవ్, ఆకాష్, పండు, సంతు, సన్నీ, అనూష్, నవీన్ రెడ్డి, లక్ష్మణ్, గజ్జల రమేష్, నారాయణ, రామకృష్ణ, మైత్రి నగర్ కృష్ణ, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఇంటి వద్దకే 'మీ సేవ'..

-3 పేజి తరువాయి
ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస సర్టిఫికెట్లు, ఈసీ కాపీలు, పోలీసు శాఖ సేవలు, ఐజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు.. ఇలా 'మీ సేవ' ద్వారా అందించే అన్ని ముఖ్యమైన పౌర సేవలు అందిస్తారని మంత్రి వివరించారు. ఇందుకోసం 70 మందికి పైగా మీ సేవ ఏజెంట్లు, మీ సేవ వీఎల్ఈలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. తొలి దశలో 'క్యూర్' ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టామని.. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తామని మంత్రి చెప్పారు.

# రిమ్స్‌లో పసికందుల మృత్యుఘోష.. ఐదుకు చేరిన మృతులు

-3 పేజి తరువాయి
సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. వారిలో ఒక శిశువు రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందగా.. మరో శిశువును మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. తమ బిడ్డలు క్షేమంగా తిరిగి వస్తారని ఎదురుచూసిన కుటుంబాలకు వరుస మరణాలు తీరని విషాదాన్ని మిగిల్చాయి. మరోవైపు ఘటనకు దారితీసిన పరిస్థితులు, భద్రతా ఏర్పాట్లు, అత్యవసర తరలింపు చర్యలపై అధికారుల విచారణ కొనసాగుతోంది.

**మరో ఇద్దరి మృతితో.. ఐదుకు చేరిన సంఖ్య**

ఎస్ఎన్‌సీయూ వార్డులో అర్ధరాత్రి ఏసీ యూనిట్‌లో మంటలు చెలరేగి దట్టమైన పొగ వ్యాపించడంతో చిన్నారులను సిబ్బంది హుటాహుటిన సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రమాదం అనంతరం ముగ్గురు చిన్నారులు మృతి చెందగా.. తాజాగా మరో ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. మృతుల్లో దుబ్బగూడ, లింగాపూర్ ప్రాంతాలకు చెందిన శిశువులు ఉన్నారు. ఒక చిన్నారి రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందగా.. మరో చిన్నారిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించే క్రమంలో మృతి చెందినట్లు తెలిసింది. దీంతో ఘటన జరిగిన రెండు రోజుల వ్యవధిలోనే ఐదుగురు నవజాత శిశువులు మృతి చెందడం తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. తమ బిడ్డల కోసం ఆస్పత్రుల వద్ద కుటుంబ సభ్యులు ఆందోళనతో ఎదురుచూస్తుండగా.. మిగిలిన చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

**ఘటనపై కొనసాగుతున్న విచారణ..**

రిమ్స్ అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. మంగళవారం రిమ్స్‌ను సందర్శించిన మంత్రి ప్రమాదం జరిగిన ఎస్ఎన్‌సీయూ వార్డును పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక విచారణలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఏసీ యూనిట్‌లో మంటలు చెలరేగి పొగ వ్యాపించినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఘటనపై నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి ఎలక్ట్రికల్, ఫైర్, సివిల్ సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నిర్లక్ష్యం లేదా బాధ్యతారాహిత్యం తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రిమ్స్‌లో 150 పడకల మదర్ అండ్ చైల్డ్ హెల్త్ భవనాన్ని ఏర్పాటు చేసి ఆస్పత్రిని సుమారు 950 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

**పరిహారం కోసం డిమాండ్లు.. ప్రభుత్వంపై విమర్శలు**

ఘటనపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత రిమ్స్‌ను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఐదుగురు శిశువుల మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆమె ఆరోపించారు. రిమ్స్‌లో వైద్యులు, నర్సులు, శానిటేషన్ సిబ్బంది కొరతతో పాటు మౌలిక వసతుల సమస్యలు ఉన్నాయని విమర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. మరోవైపు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తదితరులు రిమ్స్‌ను సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున, గాయపడిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించాలని సత్యవతి రాథోడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా రిమ్స్ అభివృద్ధి పనులకు సుమారు రూ.150 కోట్ల నిధులను వెంటనే మంజూరు చేసి 150 పడకల ఆస్పత్రి, ఇతర మౌలిక వసతుల పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రభుత్వాన్ని కోరారు.

**ఘటనపై డీఐజీ ఆరా..**

రిమ్స్‌లో జరిగిన ఘటనపై డీఐజీ ఆర్.భాస్కరన్ ఐపీఎస్ కూడా ఆరా తీశారు. ఆస్పత్రిని సందర్శించిన ఆయన ఘటనకు దారితీసిన పరిస్థితులు, సంఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటన సమయంలో 27 మంది చిన్నారులు చికిత్స పొందుతుండగా.. రెండు రోజుల వ్యవధిలో ఐదుగురు మృతి చెందడం బాధాకరమని పేర్కొంటూ మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఘటన సమాచారం అందిన వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టిన పోలీసు, ఆస్పత్రి సిబ్బంది కృషిని అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో సమన్వయంతో స్పందించడం ద్వారా చిన్నారులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టిన సిబ్బందిని ప్రశంసించారు.

# పాలకుర్తి నియోజకవర్గం దర్దేపల్లి గ్రామంలో వినాయకునికి లక్ష ఉండ్రాళ్ళ సమర్పణ



**హైదరాబాద్ పెన్ పవర్:** జనగామ జిల్లా పాలకుర్తి మండలం దర్దేపల్లి గ్రామంలో విగ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఉన్నటువంటి వినాయకునికి లక్ష ఉండ్రాళ్ళ ను మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో భజన కిర్తనలతో కొలహాలంతో సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి యూత్ సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.....

# ప్రజా కళా జాతరను జయప్రదం చేయండి....

## దరువు అంజన్న సలహాదారులు భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వం,




**హైదరాబాద్ పెన్ పవర్:** అరుణోదయ విప్లవ ప్రజా సాంస్కృతిక ఉద్యమం 52 ఏళ్ల ప్రస్థానంలో భాగంగా, 50 ఏళ్ల విమలక్క విప్లవ సాంస్కృతిక ఉద్యమ ప్రస్థానాన్ని ఎత్తిపడుతూ నిర్వహిస్తున్న 50 గంటల ప్రజా కళా జాతరను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా కళా జాతర కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను గాజుల రామారం లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, సెప్టెంబర్ 26, 27, 28 తేదీల్లో మూడు రోజులపాటు =జ కళ్యాణ మండపం హైదరాబాద్ లో జరిగే ప్రజా కళా జాతరలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చలు, సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విప్లవ ప్రజా సాంస్కృతిక ఉద్యమ ప్రస్థానాన్ని, ప్రజా కళలను, ప్రజల్లోకి తీసుకెళ్లే ఈ కార్యక్రమానికి ప్రజలు, కళాకారులు, మేధావులు, కార్మికులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై ప్రజా కళా జాతరను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఉద్యమ కళాకారుడు భాషా సాంస్కృతిక శాఖ సలహాదారుడు దరువు అంజన్న, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ మల్సూర్, ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ రమేష్ పోతుల, సహాయ కార్యదర్శి కామ్రేడ్ రాకేష్, సౌమ్య, సంధ్య, శ్రీలత, అరుంధతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# భక్తిమార్గంలో యువత ఆదర్శంగా నిలవాలి....

- కైలాస్‌హిల్స్‌లో ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు
- భారీగా పాల్గొన్న భక్తులు
- దాదాపు వెయ్యి మందికి పైగా  అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారని
- స్పష్టం చేసిన వినాయక మండప నిర్వాహకులు

**హైదరాబాద్ పెన్ పవర్:**
యువత భక్తిమార్గంలో పయనిస్తూ తెలుగు సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడేందుకు కృషి చేయాలని కైలాస్‌హిల్స్ కాలనీ పెద్దలు పిలుపునిచ్చారు. కైలాస్‌హిల్స్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపకులు వాసన సాయి తేజ  ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వాసాల సాయితేజ ఆధ్వర్యంలో గత తొమ్మిదేళ్లుగా కైలాస్‌హిల్స్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. తొమ్మిదో సంవత్సరం ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో దాదాపు వెయ్యి మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు మాట్లాడుతూ చిన్న వయసులోనే భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్న సాయితేజ, ఆయన బృందాన్ని శ్రావణ్ కుమార్  వాసాల కార్తీక్ తేజ్ ప్రవీణ్ రెడ్డి రాకేష్  నవీన్ చిన్న రోహిత్ సాయి ప్రసాద్ సాయి చోటు మనీ పండు .అభినందించారు. యువత భక్తిమార్గంలో ముందుకు సాగడంతో పాటు మన సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించేలా కృషి చేయాలని కోరారు. యువతను సన్మార్గంలో నడిపించేందుకు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. కైలాష్ హిల్స్ కాలనీ మాజీ అధ్యక్షుడు యాదయ్య మాట్లాడుతూ యువతకు భక్తి, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సాయి తేజ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకరించిన పెద్దలకు తోటి మిత్రులకు ఇక్కడికి విచ్చేసిన సీనియర్ జర్నలిస్టులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు
కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, కాలనీవాసులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.








# బాచుపల్లిలో అక్రమ భవనంపై చర్యలు తీసుకోవాలి....

- జీ+2 అనుమతికి విరుద్ధంగా వాణిజ్య దుకాణాల నిర్మాణం?
- సెట్‌బ్యాక్‌లు, ఎల్ఆర్ఎస్‌పై సమగ్ర విచారణకు రమణి మాల్యాల డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:**
బాచుపల్లి లెజెండ్ ఎస్టేట్‌లోని శ్రీ రామరాజు రెసిడెన్సీలో భవన నిర్మాణం, వాణిజ్య వినియోగం, ఎల్ఆర్ఎస్ మంజూరుపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘనలు తేలితే చర్యలు తీసుకోవాలని కోరుతూ రమణి మాల్యాల సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్లు 133, 135, ప్లాట్ నంబర్లు 23, 24లో సుమారు 603 గజాల స్థలంలో 2019 మార్చి 12న గ్రామపంచాయతీ ద్వారా జీం2 నివాస భవనానికి అనుమతి పొందినట్లు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం అనుమతులకు విరుద్ధంగా వాణిజ్య దుకాణాలు నిర్మించి వినియోగిస్తున్నారా? తప్పనిసరి సెట్‌బ్యాక్‌లు పాటించారా? అనే అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని కోరారు. నివాస భవన నిర్మాణానికి అనుమతి ఉన్నప్పటికీ అదే భవనంలో వాణిజ్య దుకాణాలు నిర్మించి అద్దెకు ఇచ్చి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మంజూరైన నిర్మాణ ప్రణాళికకు అనుగుణంగానే భవనం ఉందా? వాణిజ్య వినియోగానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా? అనే అంశాలను అధికారులు నిర్ధారించాలని కోరారు. భవన నిర్మాణంలో ముఖ్యంగా పశ్చిమ వైపు తప్పనిసరి ఖాళీ స్థలం వదిలారా లేదా అనే అంశంపై అనుమానాలు ఉన్నాయని రమణి మాల్యాల పేర్కొన్నారు. ముందుభాగం, వెనుకభాగం, తూర్పు, పశ్చిమ వైపుల సెట్‌బ్యాక్‌లతోపాటు పార్కింగ్, ఓపెన్ స్పేస్ తదితర అంశాలను మంజూరైన ప్రణాళికతో పోల్చి అధికారికంగా కొలతలు తీసుకోవాలని కోరారు. నిర్మాణంలో అనుమతులకు విరుద్ధంగా మార్పులు ఉన్నట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సదరు స్థలానికి సంబంధించిన ప్రొసీడింగ్ నంబర్ 12955/ఎల్‌పీఎస్/హెచ్ఎండీఏ/పీఎల్‌జీ/2008 ద్వారా ఎల్ఆర్ఎస్ ఏ ప్రాతిపదికన మంజూరైందనే అంశంపైనా పూర్తి స్థాయి విచారణ జరపాలని రమణి మాల్యాల కోరారు. అసలు లేఅవుట్ అనుమతి పరిస్థితి, ఎల్ఆర్ఎస్ దరఖాస్తు, మంజూరు తేదీలు, సాంకేతిక పరిశీలన, సంబంధిత అధికారుల ధ్రువీకరణ తదితర అంశాలను అసలు దస్త్రాల ఆధారంగా పరిశీలించాలని పేర్కొన్నారు. అలాగే 30-10-2010 నాటి లేఅవుట్, ఎల్ఆర్ఎస్ రికార్డులు, లేఅవుట్ అనుమతి స్థితిని పరిశీలించి, ఎల్ఆర్ఎస్ మంజూరు సమయంలో నిబంధనలు పాటించారా లేదా నిర్ధారించాలని కోరారు. విచారణలో నిబంధనల ఉల్లంఘన, వాస్తవాల దాచివేత లేదా తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలితే వర్తించే చట్టం ప్రకారం ఎల్ఆర్ఎస్‌ను రద్దు లేదా ఉపసంహరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవనంలోని నివాస ఫ్లాట్ల విక్రయం, వాణిజ్య దుకాణాల అద్దె వినియోగంపైనా అధికారులు విచారణ జరపాలని ఫిర్యాదులో కోరారు. భవన అనుమతి, మంజూరైన నిర్మాణ ప్రణాళిక, వాస్తవ నిర్మాణం, వినియోగానికి సంబంధించిన అనుమతులు, ఆస్తి పన్ను వివరాలు, భూమి వినియోగం తదితర అంశాలను పరిశీలించాలని పేర్కొన్నారు. స్థలాన్ని అధికారులు స్వయంగా సందర్శించి ప్లాట్ విస్తీర్ణం, నిర్మిత విస్తీర్ణం, అంతస్తుల సంఖ్య, సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్, ఓపెన్ స్పేస్, వాణిజ్య దుకాణాలు, నివాస ఫ్లాట్లు, మంజూరైన ప్రణాళికతో వాస్తవ నిర్మాణంలోని వ్యత్యాసాలను అధికారికంగా కొలిచి నివేదిక రూపొందించాలని రమణి మాల్యాల కోరారు. విచారణలో వెల్లడైన అంశాలు, తీసుకున్న చర్యలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

# 15 అడుగుల భారీ మట్టి గణపయ్యకు ఘనంగా వీడ్కోలు

**హైదరాబాద్ పెన్ పవర్:** :నర్సంపేట పట్టణంలోని 25వ డివిజన్‌లో ప్రతిష్టించిన 15 అడుగుల భారీ మట్టి వినాయకుడికి బుధవారం భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన ఈ భారీ మట్టి గణపతికి ఉదయం నుండి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.?అనంతరం నిర్వహించిన శోభాయాత్రలో స్థానిక మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని, భక్తిశ్రద్ధలతో కోలాటాలు ఆడుతూ, నృత్యాలు చేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. గణపతి బప్పా మోరియా, మంగళ్ మూర్తి మోరియా నామస్మరణలతో నర్సంపేట వీధులు మారుమోగాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.?ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, వార్డు ప్రజలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# గణపతి నిమజ్జనంలో సేవలు అందించిన ఎన్సీసీ విద్యార్థులు

**హైదరాబాద్ పెన్ పవర్:** పట్టణంలో అత్యంత వైభవంగా జరుగుతున్న గణపతి నిమజ్జనోత్సవ వేడుకలలో అశోక్ నగర్ సైనిక పాఠశాలకు చెందిన ఎన్సీసీ కేడెట్లు కీలక పాత్ర పోషించారు. నిమజ్జన శోభాయాత్ర సజావుగా సాగేందుకు నర్సంపేట పురవీధుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా 40 మంది ఎన్సీసీ విద్యార్థులు పోలీసు శాఖకు సహకరిస్తూ విధుల్లో పాల్గొన్నారు. అత్యంత క్రమశిక్షణతో అంకితభావంతో సేవలు అందించిన విద్యార్థుల తీరును స్థానిక ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, పలువురు ప్రశంసించారు. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి నిమజ్జన వేడుకలలో సేవలందించిన విద్యార్థులను వారిని ప్రోత్సహించిన సైనిక పాఠశాల ప్రిన్సిపల్ గట్ల సురేందర్, డైరెక్టర్ కంసాని దామోదర్ రెడ్డి లను పలువురు అభినందించారు.

# కృష్ణా జలాలు విడుదల చేయాలని కర్ణాటక సీఎంకు తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేల విజ్ఞప్తి

**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణ తెలంగాణలోని రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కృష్ణా నది నుంచి సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు బండ్లకృష్ణమోహన్ రెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్ రెడ్డిల బృందం కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తో భేటీ అయ్యింది.ప్రస్తుతం జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఆయకట్టు పరిధిలో పంటలు కీలక

దశలో ఉన్నందున, వాటిని కాపాడేందుకు కర్ణాటక నుంచి కృష్ణా జలాలను విడుదల చేయాల్సిన అవసరాన్ని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ దృష్టికి తెలంగాణ ప్రతినిధి బృందం తీసుకెళ్లింది.ఈ నాలుగుసాగునీటి పథకాల కింద దాదాపు 5.5 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని, ఈ ప్రాంతాల్లో వేలాది రైతు కుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నాయని వివరించారు. ప్రస్తుత దశలో నీటి కొరత

ఏర్పడితే పంట దిగుబడులతో పాటు రైతుల ఆదాయం, జీవనోపాధిపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు.

5,000 క్యూసెక్కులు.. ఒక నెల పాటు ప్రస్తుత పంటలను కాపాడేందుకు కృష్ణా నది నుంచి5,000 క్యూసెక్కుల నీటిని నిరంతరాయంగా ఒక నెల రోజుల పాటు విడుదల చేయాలని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను మంత్రులు, ఎమ్మెల్యేల బృందం కోరింది. ఈ నీటితో కీలక దశలో ఉన్న పంటలకు సకాలంలో సాగునీరు అందించి రైతులను ఆదుకోవచ్చని వివరించింది.మిగిలిన రుతుపవన కాలంలో కృష్ణా పరివాహక ప్రాంతంలో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ప్రస్తుతంనియంత్రిత పద్ధతిలో నీటిని విడుదల చేస్తే అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని ప్రతినిధి బృందం వివరించింది.

రైతుల పంటలు, వారి జీవనోపాధిని కాపాడటమే ప్రధాన లక్ష్యంగా కర్ణాటక ముఖ్యమంత్రితో ఈ భేటీ జరిగింది. పొరుగు రాష్ట్రాల మధ్య సహకార స్ఫూర్తితో కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ మంత్రులు,ఎమ్మెల్యేలు కోరారు.

మంత్రులు చేసిన విజ్ఞప్తికి కర్ణాటక సీఎం డీకే శివకుమార్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ రైతులకు లాభం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# నయీం హత్య కేసులో మరో ముగ్గురి అరెస్ట్



బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో రౌడీషీటర్ మహమ్మద్ నయీం హత్య కేసులో పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి సహా ముగ్గురిని నాగోల్ పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు.ఖమ్మంకు చెందిన కె.ఉమామహేష్ అలియాస్ జేకే మహేష్ (34), సాయినగర్‌కు చెందిన మహమ్మద్ మున్నా అలియాస్ బోలె (47), ఖమ్మం జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దుగ్గిరాల కార్తీక్ (29)లను ఎల్.బి.నగర్‌లో అదుపులోకి తీసుకున్నారు.ఈ నెల 14న బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో నయీమ్‌పై నిందితులు వేటకొడవళ్లతో దాడి చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఈ నెల 16న ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.ప్రధాన సూత్రధారి ఉమామహేష్ మాత్రం అప్పటి నుంచి పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు.తాజాగా అతడితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. నయీం, ఉమామహేష్ బాల్య స్నేహితులు. చిన్నతనం నుంచే నేరాలకు పాల్పడటంతో ఇల్లందు పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరిపై రౌడీషీట్లు ఉన్నాయి. కొంతకాలంగా ఇల్లందు, కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు చేస్తూ ఉండేవారు.

ఓ రియల్ ఎస్టేట్ సెటిల్మెంట్లో విభేదాలు రావడంతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండగా, ఉమా మహేష్ ఖమ్మంలో సోలార్ ప్యానల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కాగా ఇద్దరి మధ్య ఏర్పడిన విభేదాలు ఒకరిపై ఒకరు కక్ష పెంచుకునేలా దారితీసింది.నయీంను హత్య చేసేందుకు ఈ నెల 13న ఖమ్మంలోని ఓ హోటల్‌లో ఉమా మహేష్ తన అనుచరులతో కలిసి పథకం రచించి మరుసటి రోజు ఖమ్మం నుంచి నిందితులు కారులో హైదరాబాద్‌కు చేరుకున్నారు. మున్నా ద్వారా నయీంకు ఫోన్ చేసి అతడి ఆచూకీ తెలుసుకున్నారు.

బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో నయీం ఉన్నట్లు నిర్ధారించుకుని అక్కడికి వెళ్లి అతడి కళ్లలో కారం చల్లి వెంబడించిన నిందితులు.. హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

ఈ కేసులో ఇప్పటికే ఎనిమిది మంది అరెస్టు కాగా.. తాజాగా మరో ముగ్గురి అరెస్టుతో మొత్తం అరెస్టుల సంఖ్య 11కు చేరింది. కాగా ఈ కేసులో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్, ఐపీఎస్ బి.సుమతి ఆదేశాలతో ఎల్.బి.నగర్ డీసీపీ బి.అనురాధ, ఎస్ఓటి ఏసీపీ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో నాగోల్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పరారీలో ఉన్న నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చేపట్టి ప్రధాన సూత్రధారి ఉమామహేష్‌తో పాటు మరో పదిమంది నిందితులను అరెస్టు చేసినట్లు నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు.

# రాష్ట్రంలోని 14 లక్షల మంది విద్యార్థుల స్కాలర్ షిప్ లు - ఫీజులు వెంటనే చెల్లించాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**
:రాష్ట్రంలో 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల స్కాలర్ షిప్లు, ఫీజుల బకాయిలు 8500కోట్లు వెంటనే విడుదల చేయాలని, ఈ స్కీము ఎత్తివేయాలనే కుట్రలు మానుకోవాలని, ఈ స్కీమును యధాతథంగా పాత పద్ధతిలోనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులు నేడు విద్యానగర్ నుంచి భారీ ప్రదర్శన జరిపారు. ఈ ప్రదర్శనకు బిసి సంక్షేమ సంఘం సంఘం జాతీయఅధ్యక్షులు,రాజ్య సభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ స్కీముకు బడ్జెట్ ఇవ్వకుండా ముఖ్యమంత్రి పేద కులాల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ఫీజుల బకాయిలు ఇవ్వాలని శాంతియుతంగా ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు చదువుకుంటుంటే కూడా ఓర్వలేక పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని పేద కులాలు చదువుకోకుండా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.

ఈ ఫీజుల బకాయిలు 8500 కోట్లు చెల్లించడం ముఖ్యమంత్రికి ఒకలెక్క కాదు. మూడున్నర సంవత్సరాలుగా విద్యార్థులు పడుతున్న భాదలు చెప్పతరం కాదు. కోర్సు పూర్తి అయిన 6 లక్షల మందికి కాలేజి యాజమాన్యాలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదు. వీరికి ఉద్యోగాలు వచ్చిన చేరలేక - ఉన్నత విద్యకు పోలేక చాల ఇబ్బంది పడుతున్నారు. చదువుతున్న వారి ఫీజులు కట్టే వరకు కాలేజీలకు రానివ్వడంలేదు. ఫీజుల బకాయిలు చెల్లించక పోవడంతో విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ భారీ ప్రదర్శనలో రాష్ట్ర బి.సి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, రాష్ట్ర బి.సి విద్యార్ధి సంఘం రాష్ట్ర కన్వీనర్ నిఖిల్ పటేల్, అధ్యక్షులు పగిళ్ళ సతీష్, బి.సి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి. రాజేందర్, నరేష్ గౌడ్, శివ కుమార్ యాదవ్, రమేష్, రాహుల్, సురేష్, రమణ, కె. వంశీ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# నాగోల్ లో బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో మేగా రక్తదాన శిబిరం .. పాల్గోన్న ఎంపి ఈటల



**హైదరాబాద్ పెన్ పవర్:**
ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాక్షేత్రంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభసందర్భంగా, దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "సేవా సంకల్ప్ అభియాన్"లో భాగంగా ఈరోజు భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో నాగోల్ లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో ఎంపి ఈటల రాజేందర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్ర శేఖర్జి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపి ఈటల మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ 77వ వసంతంభలోకి అడుగుపెట్టారు. 25 ఏళ్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా వారు అందించిన సేవలు దేశం గర్వపడుతుంది. రతజాతి కులాలు మతాలు ప్రాంతాలకు అతీతంగా ఆయన్ని గుర్తించి గౌరవిస్తుంది. ప్రపంచ చిత్రపటం మీద దేశ ఔన్నత్యాన్ని మోదీ రు పెంచారు అనడంలో సందేహం లేదని అన్నారు.

భారతదేశం సొంత కాళ్ళ మీద నిలబడి మోడ్రన్ రైల్వే సిస్టం, ఎయిర్పోర్టు, వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు ఏర్పాటు చేస్తున్నారు. మౌలిక సదుపాయాల కోసం 2014 కంటే ముందు 2 లక్షల కోట్ల రూపాయల ఖర్చు చేస్తే ఇప్పుడు 15 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నాం. దేశాన్ని గొప్పగా తీర్చిదిద్దుతున్నారు. ఆయన ఎప్పుడూ నేను పాలకున్ని అని అనరు, సేవకున్ని మాత్రమే అని చెప్తారు.

76 సంవత్సరాల వయసులో కూడా ఒక్కరోజు కూడా సెలవు లేకుండా నిరంతరం యంత్రంలాగా పనిచేస్తూ దేశాన్ని ముందుకు తీసుకుపోతున్న మోదీ గారు మరింత ఆరోగ్యవంతంగా ఉండి, ప్రజల ఆశీర్వాదం పొంది, భగవంతుని దయతో మరింత సేవా అందించాలని కోరుతున్నామని అన్నారు. ఈరోజు బీజేవైయం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించాము. ఇందులో పాల్గొని రక్త దానం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు , బండ కార్తీక , రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎన్. గౌతం రావు, తుళ్ల వీరేందర్ గౌడ్ , బీజేవైయం రాష్ట్ర అధ్యక్షులు కుండె గణేష్ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి మాజీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# తొలి స్టోర్‌తో హై-స్ట్రీట్ ఫ్యాషన్ బ్రాండ్ కెల్లీ ఫెల్డర్

**హైదరాబాద్ పెన్ పవర్:** బంజారా హిల్స్ లో తొలి స్టోర్‌తో అంతర్జాతీయ హై-స్ట్రీట్ ఫ్యాషన్ బ్రాండ్ కెల్లీ ఫెల్డర్ భారత్‌లోకి అడుగుపెట్టింది. కొలంబో, మెల్‌బోర్న్ తర్వాత హైదరాబాద్‌ను భారత తొలి స్టోర్‌కు వేదికగా ఎంచుకుంది. నటి నేహాశర్మ ముఖ్య అతిథిగా హాజరైన ఈ ప్రారంభోత్సవంలో ఫ్యాషన్ ప్రియులు, కంటెంట్ క్రియేటర్లు పాల్గొన్నారు. మహిళలు, పురుషుల దుస్తులు, పెర్ఫార్మెన్స్‌వేర్, యాక్సెసరీస్‌తో కలెక్షన్లను అందుబాటులోకితెచ్చిన కెల్లీ ఫెల్డర్, త్వరలో దేశంలోని ఇతర నగరాలకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# ప్రజాప్రతినిధుల కోర్టుకు హజరయిన డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్ పెన్ పవర్:** నాంపల్లి లోని ప్రజా ప్రతినిధుల మనోరంజన్ కోర్టుకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క హజరయ్యారు. 2022 జనవరి 4న కొత్తగూడెం జిఆర్ బస్తీ ప్రభుత్వ ఆసుపత్రిలో కోవిడ్ రూల్స్ పాటించకుండా ప్రెస్ మీట్ నిర్వహించారని బట్టి విక్రమార్క తో పాటు ఆరుగురు కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు అయింది. ఆ కేసులో విచారణలో భాగంగా న్యాయమూర్తి ముందు హాజరైయారు.

# రూ.6.70 లక్షల ఓజీ కుష్,మద్యం బాటిల్ల పట్టివేత..

## 60 60 గ్రాముల ఓ జి కుష్.

## 14 ఖరీదైన మద్యం బాటిల్ల స్వాధీనం.

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రాలను దాటించి.. ఆన్లైన్లో కంప్యూటర్ కీబోర్డ్ ముసుగులో పెద్ద మొత్తంలో ఓ జి కుష్ ను దిగుమతి చేసుకొని హైదరాబాద్ లో అమ్మకాలు జరుపుతున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్ టీం సీఐ రమేష్ సిబ్బంది కలిసి పట్టుకున్నారు. దంతూరి వాసుదేవ వర్మ, చెడిపూడి కుందన్ రెడ్డి ఇంట్లో తనిఖీలు చేయగా ఖరీదైన శివాజీ రీగల్ పురాతనమైన బాటిళ్ల ను కూడా 14 నిందితుల ఇంటిని నుంచి ఎస్టిఎఫ్ టీం ~ా సీజ్ చేశారు. ఈ కేసులో దంతూరి వాసుదేవ వర్మ, చెడిపూడి కుందన్ రెడ్డిలను అరెస్టు చేశారు.

పట్టుకున్న ఓజిగుష్ మద్యం బాటిల్లు మొత్తంగా రూ. 6.70 లక్షలు గా ఉంటుందని అంచనా వేశారు.

నిందితుల వద్ద ఉన్న 60 గ్రాములు 14 మద్యం బాటిల్లను కూకట్పల్లి ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సీఐ తెలిపారు.

# కరెంట్ కోతలతో కాలిపోతున్న ట్రాన్స్ఫార్మర్లు.. ఎండిపోతున్న పైర్లు

**సూర్యాపేట: పెన్ పవర్:** పెన్పహాడ్ మండలం గాజుల మల్కాపురం గ్రామంలో ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతున్నాయి. దాంతో పైర్లు ఎండిపోతున్నాయని రైతులు మండిపడుతున్నారు. కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్లతో రిపేర్ కేంద్రానికి లైన్లు కట్టారు. రోజుకు కేవలం 7-8 గంటలు మాత్రమే కరెంట్ వస్తుందని, అది కూడా 4 విడతలుగా వదలడంతో లో ఓల్టేజ్ సమస్యతో ట్రాన్స్ఫార్మర్లు, మోటార్లు కాలిపోతున్నాయని రైతుల ఆవేదన. పది0 రోజులైనా ట్రాన్స్ఫార్మర్లు రిపేర్ చేయకుండా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీంతో పంటలు ఎండిపోతున్నాయని గోస పెట్టుకుంటున్నారు. పంటలు ఎండిపోయి పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి వచ్చిందని, ప్రభుత్వం ఇకనైనా కోతలు లేకుండా కరెంట్ వదలాలని రైతులు ఆగ్రహం వ్యక్తం చేసారు.

# రిమ్స్ బాధిత కుటుంబాలను పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు

**అదిలాబాద్ పెన్ పవర్:** :ఆదిలాబాద్ రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో బాధిత కుటుంబసభ్యులను బీఆర్ఎస్ నేతలు బుధవారం పరామర్శించారు. బాధిత చిన్నారుల కుటుంబసభ్యులను రిమ్స్ ఆసుపత్రిలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జోగు రామన్న, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు తుల ఉమ, బుక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు. బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తే, ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. రిమ్స్ ఆసుపత్రి ప్రమాదంలో మరణించిన చిన్నారుల కుటుంబాలకు రూ.25 లక్షలు, క్షతగాత్రులకు రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసారు.మరోవైపు, రిమ్స్ ప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. మరో ఇరవై మంది చిన్నారుల పరిస్థితి విషమంగానే వుందని సమాచారం.

# 'న్యూ ఐడెంటిటీ' ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను ప్రారంభించిన మృణాల్ ఠాకూర్

**హైదరాబాద్ పెన్ పవర్:** కూకట్‌పల్లిలోని నెక్సస్ హైదరాబాద్ మాల్ లో మ్యాక్స్ ఫ్యాషన్ తన తొలి 'న్యూ ఐడెంటిటీ' ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను ప్రారంభించింది. సుమారు 13 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌ను నటి మృణాల్ ఠాకూర్ ప్రారంభించారు. మ్యాక్స్ ఫ్యాషన్ సీఈఓ సుమిత్ చంద్నాతో కలిసి మృణాల్ ఠాకూర్ రిబ్బన్ కట్ చేసి స్టోర్‌ను ప్రారంభించారు. అనంతరం కల్కి కోచ్లిన్ క్యూరేట్ చేసిన 'మ్యాక్స్ ప్రాజెక్ట్ న్యూ' ఫెస్టివ్ కలెక్షన్‌ను ఆవిష్కరించారు. పురుషులు, మహిళలు, పిల్లలకు ఫ్యాషన్ దుస్తులు, పాదరక్షలు, యాక్సెసరీస్‌ను అందించే ఈ స్టోర్ హైదరాబాద్‌లో మ్యాక్స్ ఫ్యాషన్‌కు 39వ స్టోర్‌గా నిలిచింది.

## విఘ్నేశ్వరుడి లడ్డూను దక్కించుకున్న ముస్లిం నేత



లడ్డు పాట నిర్వహిస్తున్న శ్రీరాంనగర్ వాసులు

**ఖమ్మం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** ఖమ్మం ఏదులాపురం మున్సిపాలిటీ వరంగల్ క్రాస్ రోడ్‌లోని శ్రీరామ్‌నగర్‌లో ముస్లిం నేత గణేషుడి లడ్డూను దక్కించుకున్నారు. 28, 29వ వార్డుల పరిధిలో ఉన్న దర్గా వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మంగళవారం రాత్రి నిర్వహించిన గణేషుడి లడ్డూ వేలం పాటలో 28వ వార్డు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకుడు షేక్ హుస్సేన్ రూ.60,500లకు లడ్డూను దక్కించుకున్నారు. వినాయకుడి లడ్డూ వేలం పాటలో ముస్లిం నేత పాల్గొని లడ్డూను సొంతం చేసుకోవడంతో స్థానికంగా ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించింది. కులమతాలకు అతీతంగా ముస్లిం నే సోదరభావం, పరస్పర గౌరవానికి ఈ ఘటన నిదర్శనంగా నిలిచిందని స్థానికులు పేర్కొన్నారు. వినాయక చవితి వేడుకల్లో షేక్ హుస్సేన్ పాల్గొని లడ్డూ వేలంలో రూ.60,500లకు పాట పాడటం పలువురి ప్రశంసలు అందుకుంది. శ్రీరామ్‌నగర్‌లో మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఈ ఘటన ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.



లడ్డు పాట దక్కించుకున్న హుస్సేన్

## పేద కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ అండ

**రూ.1 లక్ష రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత**

**హైదరాబాద్, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** మిర్యాలగూడశీ నియోజకవర్గ శాసనమండలి సభ్యులు కేతావత్ శంకర్ నాయక్ ఆదేశాల మేరకు సామాజికవేత్త, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొమ్ము దాసు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొండ లక్ష్మణ్ గౌడ్, గట్టుమీద తండా గ్రామ సర్పంచ్ సోనీ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, శిబిర కార్యాలయ సిబ్బంది కలిసి రమావత్ అరుణకు రూ.1 లక్ష ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారురాలి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరుకు సహకరించిన శాసనమండలి సభ్యులు కేతావత్ శంకర్ నాయక్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, శిబిర కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## దుర్గపు సుజాత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొన్నం

**కరీంనగర్: పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలం తాడికల్ గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు దుర్గపు సుజాత ఇటీవల మృతి చెందడంతో, తాడికల్ గ్రామంలోని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దుర్గపు సుజాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం దుర్గపు సుజాత అందించిన సేవలను గుర్తు చేసుకోవడం జరిగింది. పార్టీ పట్ల వారికున్న అంకితభావం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, గ్రామ అభివృద్ధి కోసం ఆమె చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు.

ఆమె కుమారుడు, కుమార్తె చదువుల వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగింది. వారు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## ఆత్మరక్షణలోకి బీఆర్ఎస్

**హైదరాబాద్, సెప్టెంబర్ 23, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా తీవ్రమైన సామాజిక సమీకరణాల పోరుగా రూపాంతరం చెందుతోంది. కేసీఆర్‌కుటుంబంపై కేవలం అవినీతి, భూదోపిడి అనే కోణంలోనే కాకుండా.. తెలంగాణలో దశాబ్దాల పాటు సాగిన గడీల పాలన , దొరల అరాచకాలు అనే సామాజిక భయాన్ని ప్రజల మనసుల్లో బలంగా నాటడానికికాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇటీవల కేసీఆర్ ను ఉద్దేశించి చేసిన తీవ్ర వ్యాఖ్యలు, ఆపై వచ్చిన విమర్శలు.. దానికి కౌంటర్ గా వెలమ సామాజికవర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటూ ఆయన చేసిన హెచ్చరికలు కొత్త రాజకీయానికి కారణంగా కనిపిస్తున్నాయి.తెలంగాణ చరిత్రను పరిశీలిస్తే బడుగు, బలహీన వర్గాలు గడీల ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాగించినపోరాటాలకు సుదీర్ఘమైన నేపథ్యం ఉంది. తెలంగాణ ఉద్యమం ద్వారా ఆ సామాజిక అసంతృప్తి తాత్కాలికంగా పక్కకు వెళ్లినప్పటికీ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్ణయాధికారాలన్నీ ఒకే కుటుంబం, నిర్దిష్టసామాజిక వర్గం చేతుల్లోనే కేంద్రీకృతమయ్యాయనే భావన బీసీ, దళిత వర్గాల్లో బలంగా నాటుకుపోయింది. ఇప్పుడు ఇదే చారిత్రక అసంతృప్తిని ఆసరాగా చేసుకుని, కేసీఆర్ కుటుంబాన్ని కేవలం ఒకరాజకీయ శత్రువుగానే కాక, బహుజన వర్గాల అవకాశాలను ఆక్రమించిన సామాజిక ప్రతినిధిగా చిత్రీకరించేందుకు రేవంత్ పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తున్నారు.ఈ రాజకీయ క్రీడలో భాగంగానే ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి వ్యూహాత్మక సంకేతాలను పంపుతున్నారు. కేసీఆర్ కుటుంబం వద్ద ఉన్న ఆస్తులు, వారి సామాజిక వర్గం ఎంత ఉందో, వారు అనుభవిస్తున్న పదవులు ఎన్ని అనే అంశాలపై పరోక్షంగా, ప్రత్యక్షంగా సభల్లోను, సభల వెలుపల ప్రస్తావించడం ద్వారా ప్రజల్లో ఆలోచన రేకెత్తించే ప్రయత్నం చేస్తున్నారు. వెలమ దొరల పాలనలో నష్టపోయిన బహుజన బిడ్డలకు అధికారాన్ని అందించామనే నరేటివ్‌ను బలోపేతం చేయడం ద్వారా ప్రతిపక్ష బీఆర్ఎస్‌ను ఆత్మరక్షణలోకి నెట్టడమే రేవంత్ రెడ్డి మార్క్ రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది.శాసనసభ్యుడు వీర్లపల్లి శంకర్ లాంటి నేతలు మరింత దూకుడుప్రదర్శిస్తున్నారు.కేసీఆర్‌ను ఉద్దేశించి చావు డప్పు కొడతాం అనడం, వెలమ సామాజిక వర్గాన్ని నేరుగా హెచ్చరిస్తూ పరుష పదజాలంతో విరుచుకుపడటం వెనుక.. బీఆర్ఎస్ కౌంటర్ దాడి చేస్తే దానినిదొరలు–బహుజనుల మధ్య ఘర్షణగా మలిచే ఆంతర్యం దాగి ఉందనేది కొట్టిపారేయలేము. తాండ్ర పాపారాయుడి పౌరుషం ప్రస్తావిస్తూ, సీఎం రేవంత్‌కి తెల్వకుండానే అంతు చూస్తాం అంటూ తొడగొట్టడంవెనుక కేవలం ఆవేశం మాత్రమే కాకుండా, వెలమ ఆధిపత్యాన్ని సవాల్ చేస్తున్నారనే భావనను దిగువ వర్గాల్లోకి బలంగా పంపాలనే ఆలోచన స్పష్టమవుతోంది.బిఆర్ఎస్ తన పది సంవత్సరాల పాలనలోనిఅభివృద్ధిని చూపి పుంజుకోవాలని చూస్తుంటే, కాంగ్రెస్ సర్కార్ మాత్రం కేసీఆర్ కుటుంబాన్ని పొలిటికల్‌గా మాత్రమే కాకుండా సోషియో–పొలిటికల్‌గా కార్నర్ చేయడానికి సిద్ధమైంది. సెంటిమెంట్లు, కుల సమీకరణాలు అత్యంత సున్నితంగా ఉండే తెలంగాణ రాజకీయాల్లో ఈ సామాజిక వర్గాల ' వ్యతిరేక ప్రచారం రాబోయే రోజుల్లో ఎంతటి విధ్వంసకర రాజకీయ పరిణామాలకు దారితీస్తుందో, ఎవరికి రాజకీయలబ్ధి చేకూరుస్తుందో వేచి చూడాలి.

# 'టిడబ్ల్యూజేఎఫ్' ఆధ్వర్యంలో పులిహోర, చల్లటి మంచినీటి సేవలు

**ఖమ్మం, పెన్ పవర్ సెప్టెంబర్ 23 :** గణేషుడిని నవరాత్రి పాటు భక్తుల పూజలు, మంత్రోచ్ఛారణలు, భక్తి శ్రద్ధలతో కొలువుదీరిన విఘ్నేశ్వరుడు ఘనంగా వీడ్కోలు అందుకున్నారు. ఖమ్మం నగరంలోని నలుమూలల నుంచి వివిధ ఆకృతుల్లో అలంకరించబడిన గణనాథుల విగ్రహాలు భక్తుల కోలాహలం, డప్పు వాయిద్యాల మోత, భక్తుల నృత్యాల నడుమ నిమజ్జనానికి తరలివెళ్లాయి. చల్లటి చినుకులు కురుస్తున్నా భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. వర్షపు చినుకులను సైతం విఘ్నేశ్వరుడి ఆశీస్సులుగా భావిస్తూ భక్తులు భక్తిపారవశ్యంలో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ వాహనాలపై వైభవంగా తరలివచ్చిన గణనాథులు భక్తుల జయజయధ్వానాల మధ్య ధంసలాపురం నిమజ్జన ఘాట్‌కు చేరుకున్నారు. డప్పుల మోతకు అనుగుణంగా యువత, మహిళలు, చిన్నారులు భక్తి నృత్యాలతో సందడి చేయగా, పరిసర ప్రాంతమంతా గణనాథుడి నామస్మరణతో మార్మోగింది. తొమ్మిది రోజుల పాటు భక్తుల ఆధ్యాత్మిక భావోద్వేగాలకు కేంద్రంగా నిలిచిన విఘ్నేశ్వరుడికి కన్నుల పండువగా వీడ్కోలు పలికారు.

**భక్తులకు అండగా 'టిడబ్ల్యూజేఎఫ్' సేవలు**

నిమజ్జనానికి తరలివచ్చిన భక్తుల అలసటను గుర్తించి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ నాయకత్వం మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలను చేపట్టింది. ముస్తఫానగర్ ప్రాంతంలో భక్తులకు ఉచితంగా పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేయడంతో పాటు చల్లటి మంచినీటిని అందించారు. గంటల తరబడి నిమజ్జన వేడుకల్లో పాల్గొని అలసిపోయిన భక్తులకు ఈ సేవలు ఆప్యాయతను, ఆత్మీయతను పంచాయి. ఫెడరేషన్ నాయకులు




భక్తులకి పులిహోర.పంపిణీ చేస్తున్న టిడబ్ల్యూజేఎఫ్ కమిటీ సభ్యులు

శీలం వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పులిహోర ప్రసాదం, మంచినీటి సేవలను టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు టిఎస్.చక్రవర్తి లు అభినందించారు. గణేష్ నిమజ్జన మహోత్సవంలో భక్తులకు ఆహారం, తాగునీరు అందించడం పుణ్యకార్యమే కాకుండా మానవత్వానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలందుకున్న గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలుకుతూ, అదే సమయంలో నిమజ్జనానికి వచ్చిన భక్తులకు సేవ చేయడం ద్వారా భక్తి, సేవ, మానవతా విలువలను ఒకే వేదికపై చాటిన కార్యక్రమంగా ఈ సేవా కార్యక్రమం నిలిచిందన్నారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో, భక్తుల ఆదరాభిమానాలతో సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. సేవలను స్వీకరించిన పలువురు భక్తులు టిడబ్ల్యూజేఎఫ్ నాయకత్వాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ జానీపాష, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, సయ్యద్ అంజద్, పత్తి శ్రీనివాస్, నాయకులు వి. రోశిరెడ్డి, ఏ. మురళి, బి.రవి, ఖమ్మం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల కోసం పోరాటం ఆగదు

**ఖమ్మం, పెన్ పవర్ సెప్టెంబర్ 23:**
నాగపూర్––అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి సంబంధించి ఖమ్మం పరిధిలో బాధితులైన రైతులు, ఫ్లాట్ యజమానులకు జరుగుతున్న అన్యాయంపై న్యాయపోరాటం మరో కీలక దశకు చేరుకుంది. మంగళవారం ఢిల్లీ సుప్రీంకోర్టులో కేసులు ఫైల్ చేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే మూడు కేసులు ఫైల్ అయ్యాయని, రాబోయే రెండు మూడు రోజుల్లో మిగిలిన కేసులను కూడా ఫైల్ చేసేందుకు న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతోందనీ బాధిత రైతులు తెలిపారు. ఈ సందర్భంగా నాగపూర్ – అమరావతి హైవే నిర్మాణంలో భూములు, ప్లాట్లు కోల్పోతున్న భూ యజమానులు మాట్లాడుతూ గత కొంతకాలంగా సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, సంబంధిత ఉన్నతాధికారులను కలిసి వాదనలను వినిపించామనీ, న్యాయం కోసం హైకోర్టును కూడా ఆశ్రయించాము కానీ

ఆశించిన పరిష్కారం లభించకపోవడంతో, న్యాయం కోసం ఇప్పుడు ఉన్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందా? లేదా? అనే ప్రశ్న ప్రతి ఒక్కరి మనసులో ఉండటం సహజమని, తీర్పు ఎలా ఉంటుందో తెలియదు కానీ, అన్యాయం జరిగిందని భావించినప్పుడు మౌనంగా కూర్చోకుండా న్యాయం కోసం అందుబాటులో ఉన్న ప్రతి చట్టబద్ధమైన మార్గాన్ని ఉపయోగించుకుంటూ




అమరావతి హైవే భూములు ప్లాట్లు కోల్పోయిన బాధితులు

చివరి న్యాయస్థానం వరకు వెళ్లి హక్కుల కోసం పోరాడుతున్నామని తెలిపారు.ఎవరినీ వ్యక్తిగతంగా విమర్శించకుండా, ఎలాంటి అవాంఛనీయ చర్యలకు తావు లేకుండా, శాంతియుతంగా, ఐక్యంగా, చట్టబద్ధంగా మా హక్కుల కోసం పోరాడుతామని అన్నారు. న్యాయ పోరాటం ద్వారా మాకు జరిగిన అన్యాయాన్ని సమాజం ముందుకు తీసుకెళ్లడం కూడా ఒక ముఖ్యమైన బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. తీర్పు ఏదైనా కావచ్చుకానీ హక్కుల కోసం చివరి వరకు చట్టబద్ధంగా పోరాడామనే తృప్తి మాకు ఉంటుంది అన్నారు.హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధిత రైతులు, ప్లాట్ల యజమానులు అందరూ ఐక్యంగా ఉండి ఈ న్యాయ పోరాటానికి సహకరించాలని కోరారు.

# నకిలీ విల్లా వెంచర్ బిల్డర్‌పై తెలంగాణ రెరా కొరడా!




**హైదరాబాద్, సెప్టెంబర్ 23, పెన్ పవర్:** తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ మోసపూరిత బిల్డర్లపై తన ప్రతాపాన్ని చూపుతూ మరో సంచలన తీర్పు వెలువరించింది. సరైన అనుమతులు లేని విల్లా ప్రాజెక్ట్ పేరుతో ఓ అమాయక మహిళనుంచి రూ. 79 లక్షలు భారీగా వసూలు చేసి, ఆపై నిర్మాణం పూర్తి చేయకుండా చేతులెత్తేసిన ఓ కేటుగాడికి వ్యతిరేకంగా బాధితురాలికి అనుకూలంగా తీర్పునిచ్చింది. చట్ట నిబంధనలను ఉల్లంఘించివినియోగదారులను మోసం చేసిన ఆ బిల్డర్‌కు భారీ జరిమానా విధిస్తూ రెరా కఠిన చర్యలు తీసుకుంది.ఎలాంటి చట్టపరమైన అనుమతులు, లేఅవుట్ అప్రూవల్స్ లేకపోయినా ఆకర్షణీయమైన ప్రకటనలతోసదరు బిల్డర్ విల్లా ప్రాజెక్ట్‌ను విక్రయిస్తున్నట్లు నమ్మించాడు. దీనిని నిజమని నమ్మిన బాధితురాలు విల్లా కొనుగోలు నిమిత్తం విడతలవారీగా మొత్తం రూ. 79 లక్షలను ఆ సంస్థకు చెల్లించింది. అయితేడబ్బులు తీసుకున్నప్పటికీ ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగకపోగా, కనీస నిర్మాణాలు కూడా పూర్తి చేయకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు తక్షణమే న్యాయంచేయాలని కోరుతూ తెలంగాణ రెరాను ఆశ్రయించింది.బాధితురాలి ఫిర్యాదును అత్యంత సీరియస్‌గా పరిగణించిన టీఎస్‌రెరా అధికారులు ఇరువర్గాల వాదనలను విచారించి సమగ్ర దర్యాప్తు జరిపారు. ఎలాంటిఅనుమతులు లేకుండా ప్రాజెక్ట్ చేపట్టడం, డబ్బులు వసూలు చేసి మోసం చేయడం నిరూపితం కావడంతో రెరా చట్టం ప్రకారం బిల్డర్‌ను దోషిగా తేల్చారు. బాధితురాలి నుంచి వసూలు చేసిన అసలు మొత్తంరూ. 79 లక్షలను, ఎలాంటి జాప్యం లేకుండా చెల్లించాలని స్పష్టం చేసింది.అంతేకాకుండా, ఆ మొత్తంపై కాలయాపన చేసినందుకు గాను వార్షికంగా 10.7 శాతం వడ్డీని కలిపి బాధితురాలికి తిరిగి చెల్లించాలనిరెరా తన తీర్పులో తేల్చిచెప్పింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి వినియోగదారులను మోసగిస్తే చట్టపరంగా ఎంతటి కఠిన చర్యలు ఉంటాయో ఈ తీర్పు ద్వారా మరోసారి రుజువైంది. సోషల్ మీడియాప్రకటనలు, అనుమతులు లేని ప్రీలాంచ్ వెంచర్లను గుడ్డిగా నమ్మి మోసపోవద్దని, రియల్ ఎస్టేట్ లావాదేవీల్లో కొనుగోలుదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఈ ఘటన హెచ్చరిస్తోంది

# అంబటి అడ్డంగా బుక్కైనట్టేనా

**గుంటూరు, సెప్టెంబర్ 23,పెన్ పవర్:** లిక్కర్ స్కామ్‌లో ఈడీ నోటీసులు ఇస్తే 90 ఎంఎల్ డైలాగులు చెప్పిన అంబటి రాంబాబుకు అసలు నిజం తెలుసు. లిక్కర్ స్కామ్ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేయడంతో ఆయన గారికి అసలు భయం పట్టుకుంది. తొలుత ఈడీ నోటీసులే రాలేదని, తనకేమీ తెలియనట్లు అమాయకపు నటన ప్రదర్శించిన అంబటి.. తీరా విషయం ముదిరి పాకాన పడటంతో నాకేం భయం లేదు.. ఆరోగ్యం కుదుటపడ్డాక విచారణకు వెళ్తా అంటూ కొత్త కవరింగ్ కథనాలు మొదలుపెట్టారు. ఎందుకంటే ఆయన దందాపై పూర్తి సాక్ష్యాలు ఈడీ వద్ద ఉన్నాయి.అంబటి రాంబాబు ఎంత నాటకమాడినా మద్యం కుంభకోణంలో ఆయన పాత్రను దర్యాప్తు సంస్థలు పక్కా ఆధారాలతో పట్టుకున్నాయనేది బహిరంగ రహస్యంగా మారింది. అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో భారీ ఎత్తున సాగిన మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి ఈడీ ఈ నోటీసులు జారీ చేసింది. మద్యం విధానంలో జరిగిన అవకతవకలు, నిధుల మళ్లింపు, మనీలాండరింగ్ కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేసిన కేంద్ర దర్యాప్తు సంస్థ.. తమ ఎదుట విచారణకు హాజరుకావాల్సిందిగా ఆయనను ఆదేశించింది.ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం రవాణా, విక్రయాల ప్రక్రియలో అంబటి రాంబాబు పాత్రపై ఈడీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. మద్యం అక్రమ రవాణాకు సంబంధించిన సబ్ కాంట్రాక్టులను నిబంధనలకు విరుద్ధంగా అంబటి బినామీ సంస్థలకు కట్టబెట్టారనే అభియోగాలు దర్యాప్తులో తెరపైకి వచ్చాయి. మద్యం సిండికేట్ల నుంచి ముడుపులు ఎలా మళ్లాయి, వాటి వెనుక ఉన్న బినామీ నెట్‌వర్క్, డొల్ల కంపెనీల ఆర్థిక లావాదేవీలపై అధికారులు లోతైన ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే పీఎంఎల్ఏ చట్టం కింద అంబటికి నోటీసులు జారీ చేసి సమగ్ర వివరణ కోరింది.ఈ నోటీసుల వ్యవహారాన్ని అంబటి దాచి పెట్టే ప్రయత్నం చేశారు. రెండు వారాలుగా అనారోగ్య కారణాలతో తాను హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నానని, ఈ క్రమంలోనే ఈడీ అధికారులు ఫోన్ చేసి ఈనెల 11నే నోటీసులు పంపినట్లు చెప్పారని ఆయన పేర్కొన్నారు. అయితే నోటీసులు చేతికి రాకపోవడం వల్లే విచారణకు రాలేకపోయానని, ఏ కేసులో నోటీసులు ఇచ్చారనేది పత్రాలు చూస్తే తప్ప స్పష్టత రాదని అధికారులకు తెలిపినట్లు సమాచారం. మరోవైపు, ఈవారంలోనే హైదరాబాద్ ,



విజయవాడలోని ఈడీ కార్యాలయంలో ఆయన విచారణకు హాజరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఏపీ లిక్కర్ స్కామ్‌పై ఓవైపు రాష్ట్ర సిట్ , మరోవైపు ఈడీ దర్యాప్తును ముమ్మరం చేస్తుండటంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఈ కేసులో పలువురు కీలక వ్యక్తులు, ప్రజాప్రతినిధులు దర్యాప్తు సంస్థల విచారణను ఎదుర్కొంటున్నారు. కారుమూరి, ఆయన కుమారుడు జైలు పాలయ్యారు. అంబటి తనకేమీ సంబంధం లేదని బుకాయించే ప్రయత్నం చేసినా.. ఆధారాల్లేకుండా ఈడీ నోటీసులు ఇచ్చే అవకాశం ఉండదు.జగన్ హయాంలో ప్రభుత్వం అధికారంలోకి రాగానే తన బినామీలుగా ప్రచారంలో ఉన్న సుబ్బారెడ్డి, పురుషోత్తం అనే వ్యక్తులను రంగంలోకి దించిన అంబటి.. వారికి మద్యం సరఫరా, డిస్ట్రిబ్యూషన్ కాంట్రాక్టులు కట్టబెట్టారని విచారణలో తేలినట్లు సమాచారం. ఆ కాంట్రాక్టర్ల వద్ద నుంచి భారీ ఎత్తున కమిషన్లు, నిధులు దండుకున్న వైనంపై సిట్, ఈడీలకు సదరు బినామీలే స్వయంగా పూసగుచ్చినట్లు వివరాలు ఇచ్చేశారని, డబ్బులు ఎలా మార్పిడి జరిగాయో ఆధారాలతో సహా అప్పగించారని ప్రచారం జరుగుతోంది.అంబటి గారు అడ్డంగా దొరికిపోవడంతోనే ఇప్పుడు అసలైన వణుకు మొదలైంది. ఇప్పటికే నేతలు కారుమూరి నాగేశ్వరరావు లాంటి వారు జైలు బాట పట్టిన దృశ్యాలు కళ్లముందు కదులుతుండటంతో, ఎక్కడ ఈడీ అధికారులు తనను కూడా నేరుగా అదుపులోకి తీసుకుని రిమాండ్ కార్డ్ ఇస్తారోనని ఆయన భయాందోళనకు గురవుతున్నారు. సాధారణ పోలీసు కేసుల్లా కాకుండా, ఈడీ చట్టం కింద అరెస్ట్ అయితే అంత సులువుగా బెయిల్ రాదని, ఎంతటి వారికైనా కటకటాలు తప్పవని తెలిసి ఆయన నిద్రలేని రాత్రులు గడుపుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.టివి ఛానళ్లలో ఎదుటివారిపై పంచ్‌లు వేస్తూ, వెటకారాలతో కాలక్షేపం చేసిన అంబటి రాంబాబుకు.. ఇప్పుడు తన సొంత బినామీలే ఇచ్చిన వాంగ్మూలాలు పెద్ద ఉచ్చుగా మారాయి. మైకుల ముందు నాకేం భయం లేదు అని ఎంత గంభీరంగా నటించినా, లోలోపల మాత్రం ఈడీ అరెస్ట్ వారెంట్ ఎప్పుడు తలుపు తడుతుందోనని బెదిరిపోతున్నారనేది స్పష్టమవుతోంది. గతంలో నడిపిన లీలలు ఒక్కొక్కటిగా బయటపడుతుంటే, ఈడీ విచారణ నుంచి తప్పించుకోవడానికి ఆరోగ్యం సాకుగా చూపే కవరింగ్ డ్రామాలు ఇకపై చెల్లకపోవచ్చు.

# పిఠాపురంలో పవన్ మార్క్

**కాకినాడ సెప్టెంబర్ 23, పెన్ పవర్:** డిప్యూటీ సీఎం క్యాంపు ఆఫీసును పిఠాపురానికి మార్చాలని పవన్ కల్యాణ్ నిర్ణయించుకున్నారు తన వద్దకు సమస్యల పరిష్కారం కోసం వస్తున్న ప్రజల అర్జీలను స్వీకరించడానికి, స్థానిక సమస్యలను నేరుగా పర్యవేక్షించడానికి ఏర్పాటు చేసిన పార్టీ కమిటీ పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మరింత అందుబాటులో ఉండేందుకు డిప్యూటీ సీఎం క్యాంప్ ఆఫీస్‌నే పిఠాపురానికి తరలించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.తన పర్యటనల్లో అనేకమంది ప్రజలు వినతిపత్రాలు చేతుల్లో పట్టుకుని కిలోమీటర్ల మేర నిలబడుతుండటం తనను తీవ్రంగా ఆలోచింపజేసిందని పవన్ కళ్యాణ్ తెలిపారు. పిఠాపురం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు , వారి వినతులను స్వీకరించేందుకు జనసేన తరఫున ఒక ప్రతినిధి కమిటీని నియమించినప్పటికీ, ఆ కమిటీ బాధ్యతాయుతంగా పనిచేయడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడంపై అసహనం వ్యక్తం చేసిన ఆయన, ఇకపై బాధ్యతలను నేరుగా తమ ప్రభుత్వ యంత్రాంగమే చూసుకుంటుందని స్పష్టం చేశారు.స్థానిక నాయకత్వం , కమిటీ పనితీరు సరిగా లేకపోవడంతో, తానే స్వయంగా ప్రజా సమస్యలను పర్యవేక్షించాలని నిర్ణయించుకున్నట్లు పవన్ పేర్కొన్నారు. అందులో భాగంగానే డిప్యూటీ సీఎం క్యాంప్ ఆఫీస్ సేవలను పిఠాపురానికి విస్తరించడం, ఇక్కడి నుంచే నిర్వహించేలా మార్పులు చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. పూర్తిస్థాయి క్యాంప్ ఆఫీస్ ఏర్పాటుకు మరో మూడు నుంచి నాలుగు నెలల సమయం పడుతుందని, ఆ తర్వాత స్థానిక పాలన, ప్రజా అర్జీల స్వీకరణ అంతా పిఠాపురం నుంచే జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గాన్ని



దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా, నియోజకవర్గానికి అవసరమైన అభివృద్ధి పనులతో పాటు ప్రజల వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ నిర్ణయంతో పిఠాపురం నియోజకవర్గం త్వరలోనే రాష్ట్ర రాజకీయాలకు , పాలనకు కేంద్రబిందువుగా మారనుంది.ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం శాసనసభ్యుడు పవన్ కళ్యాణ్ తన సొంత నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామం, మున్సిపాలిటీకి అవసరమైన మౌలిక వసతుల కల్పన, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ , ఆధునిక సదుపాయాల సమకూర్చే దిశగా దాదాపు రూ. 1,500 కోట్ల వ్యయంతో బహుళ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పిఠాపురం సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పాలనాపరమైన, ఆర్థికపరమైన సంస్కరణలను వేగవంతం చేస్తున్నారు.ప్రత్యేకించి నియోజకవర్గంలో భూగర్భ జలాల పునరుద్ధరణ, గ్రామీణ పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెరువుల సుందరీకరణకు పవన్ ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. ఫకృద్దీన్ పాలెంలో మైసమ్మ చెరువును రూ. 73 లక్షలతో సుందరీకరించి వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్ ఎయిర్ జిమ్ వంటి వసతులతో గ్రామ ప్రజలకు ఆహ్లాదకర కేంద్రంగా తీర్చిదిద్దారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ. 6 కోట్లకు పైగా వ్యయంతో 14 చెరువులను ఆధునీకరించి, గ్రామీణ ప్రాంతాలకు కొత్త శోభను తీసుకువస్తున్నారు.పట్టణ పర్యావరణం, ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు జాతీయ రహదారికి సమీపంలో ఆరు ఎకరాల విస్తీర్ణంలో రూ.1.83 కోట్ల వ్యయంతో పీఠికాపుర వనం పట్టణ అటవీ ప్రాజెక్టును ఆవిష్కరించారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల ఏర్పాటు, పాఠశాలలు,

ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునీకరణ, మోడల్ అంగన్వాడీ కేంద్రాల నిర్వహణతో పాటు రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపుతున్నారు. పిఠాపురం పుణ్యక్షేత్రమైనందున పర్యాటకాభివృద్ధికి సైతం పెద్దపీట వేస్తున్నారు.అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించేందుకు , పరిపాలనా వేగాన్ని పెంచేందుకు పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కి స్వయంప్రతిపత్తి హోదాను కల్పించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ నేతృత్వంలో పనిచేసే ఈ సంస్థ ద్వారా ప్రణాళికాబద్ధంగా మౌలిక వసతులు, ఆర్థిక వృద్ధి , ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా పనులు శరవేగంగా సాగుతున్నాయి. పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న ఈ చొరవలతో పిఠాపురం రూపురేఖలు వేగంగా మారుతున్నాయి.

# కొత్త మిత్రుల కోసం జగన్ వ్యూహాలు

**విజయవాడ, సెప్టెంబర్ 23, పెన్ పవర్:**
2024 ఎన్నికల ఓటమి తర్వాత ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి గతంలో లాగా ఒంటరి పోరాటం చేయడానికి ఇప్పుడు వెనుకడుగు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అత్యంత బలంగా ఉండటం, క్షేత్రస్థాయిలో వైసీపీ కేడర్ చెల్లాచెదురు కావడం, వరుస కేసులు, అరెస్టులతో .. జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు ప్రత్యక్షంగా , పరోక్షంగా అదనపు బలాల కోసం ఆరాటపడుతున్నారు. తాము ఎవరితోనైనా కలిసి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని వైసీపీ ముఖ్య నేత సజ్జల రామకృష్ణారెడ్డి పదే పదే సంకేతాలు పంపుతున్నా.. అటువైపు నుండి సానుకూల స్పందన కరువైంది.జగన్మోహన్ రెడ్డి రాజకీయ వ్యూహాలు ఎప్పుడూ భిన్నంగా ఉంటాయి. ప్రస్తుతం ఆయన పరోక్ష రాజకీయంపైనే ఎక్కువ నమ్మకం పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. సోషల్ మీడియాలో వ్యవస్థలను, కూటమి నేతలను టార్గెట్ చేయడానికి జోసఫ్ రావణ్ వంటి వారిని భారీ బడ్జెట్‌తో రెడీ చేసుకుని, షాడో పాలిటిక్స్ నడుపుతున్నారు. కానీ, ప్రత్యక్షంగా తన ఓటు బ్యాంకుకు అదనపు ఓటు బ్యాంకును జోడించగల బలమైన పార్టీలను మాత్రం ఆయన దరిచేర్చుకోలేకపోతున్నారు. మరోవైపు జడ శ్రవణ్ కుమార్ వంటి నేతలు, దళిత ఓటు బ్యాంకును టార్గెట్ చేస్తూ జగన్ రాజకీయాలలోని లోపాలను ఎండగడుతున్నారు. ఇది వైసీపీకి కోలుకోలేని దెబ్బగా పరిణమించే అవకాశం ఉంది.ప్రస్తుత రాజకీయ సమీకరణాలలో జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీతో కలిసే అవకాశం

ఏమాత్రం లేదు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ఉనికి నామమాత్రంగానే ఉన్నా, జాతీయ స్థాయిలో ఆ పార్టీతో వైసీపీ బంధం కుదరదు. పైగా, రాష్ట్రంలో పిసిసి అధ్యక్షురాలిగా ఉన్న తన సోదరి వైఎస్ షర్మిల తో ఉన్న తీవ్రమైన ఆస్తుల వివాదం, రాజకీయ వైరం కారణంగా జగన్ కాంగ్రెస్‌తో వెళ్లాలనుకున్నా వెళ్లలేరు. ఇక మిగిలిన ప్రధాన పార్టీలన్నీ కూటమిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, కనీసం కమ్యూనిస్టు పార్టీలైనా వైసీపీతో కలిసి వస్తాయని జగన్ ఆశిస్తున్నారు. ఇందుకోసం లెఫ్ట్ పార్టీల నేతలతో వైసీపీ రాయబారాలు నడుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.కనీసం లెఫ్ట్ పార్టీలైనా వైసీపీతో కలిసి నడుస్తాయా? అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. కమ్యూనిస్టు పార్టీలు సిద్ధాంతపరంగా బీజేపీని తీవ్రంగా వ్యతిరేకిస్తాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పార్లమెంట్‌లో పదేళ్లపాటు పరోక్షంగా పూర్తి మద్దతు ఇచ్చిన వైసీపీతో కమ్యూనిస్టులు కలవడం అంత ఈజీ కాదు. పైగా, గత వైసీపీ హయాంలో అమరావతి రైతుల పోరాటం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ

ప్రైవేటీకరణ, ఉద్యోగుల సమస్యలపై లెఫ్ట్ పార్టీలు వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాయి. ఇప్పుడు అకస్మాత్తుగా జగన్మోహన్ రెడ్డితో చేతులు కలిపితే.. ఆ పార్టీల విశ్వసనీయత దెబ్బతింటుందని కొందరు లెఫ్ట్ నేతలు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకతను వాడుకోవడానికి సిద్ధాంతాలను పక్కనబెట్టి వైసీపీతో జతకడతారా? లేదా ఒంటరి గానే పోరాడతారా? అన్నది వేచి చూడాలి.నలుగురు మిత్రులు లేకుండా రాజకీయం చేయడం ఎంత కష్టమో జగన్మోహన్ రెడ్డికి ఇప్పుడు అర్థమవుతోంది. పరోక్ష వ్యూహాలు కొంతవరకు బజ్ క్రియేట్ చేయగలవు కానీ, ప్రత్యక్షంగా ఎన్నికలలో గెలవాలంటే బలమైన సామాజిక, రాజకీయ సమీకరణాలు అవసరం. ఒకవైపు తన ఓటు బ్యాంకును జడ శ్రవణ్ వంటి వారు టార్గెట్ చేస్తుంటే, మరోవైపు మిత్రపక్షాల కోసం సజ్జల రామకృష్ణారెడ్డి పంపుతున్న సందేహాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీసం కమ్యూనిస్టులైనా వైసీపీతో కలవకపోతే.. రాబోయే రోజుల్లో వైసీపీ ఉనికి మరింత ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.

# ఈడీ దూకుడు...

**విజయవాడ, సెప్టెంబర్ 23, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో దశాబ్దంలోనే అతిపెద్ద ఆర్థిక అక్రమంగా విచారణ ఎదుర్కొంటున్న రూ.3,200 కోట్ల లిక్కర్ స్కామ్ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అడుగులు సంచలనం రేపుతున్నాయి. కేవలం పైస్థాయి ప్రకటనలకే పరిమితం కాకుండా.. అక్రమ రవాణా, కమీషన్ల వసూలు, షెల్ కంపెనీల ద్వారా నిధుల మళ్లింపు వంటి ప్రతి చిన్న లావాదేవీని బయటకు తీస్తూ ఈడీ అధికారులు అరెస్టుల పర్వాన్ని ముమ్మరం చేశారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీల్ కుమార్‌లతో పాటు ఐటీ మాజీ సలహాదారు రాజ్ కేసిరెడ్డిని అరెస్ట్ చేయడం, వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు ఈడీ సమన్లు జారీ చేయడం ఈ కేసు తీవ్రతకు అద్దం పడుతోంది.ఏపీ బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ లిక్కర్ స్కామ్‌లోని అసలు సూత్రధారిని, బిగ్ హెడ్‌ను అరెస్ట్ చేయాల్సిందే అని డిమాండ్ చేస్తూ ప్రత్యక్షంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరును ప్రస్తావించడం రాజకీయంగా కలకలాన్ని రేపింది. సిట్ చార్జ్‌షీట్లతో పాటు ఈడీ నమోదు చేసిన విచారణల్లోనూ మద్యం అమ్మకాలను ప్రభుత్వ నియంత్రణలోని డిజిటల్ పేమెంట్లు లేకుండా నగదు రూపంలోనే సాగించడం, నిర్దిష్ట బ్రాండ్లకే అనుకూలంగా విధానాలు మార్చడం వెనుక నాటి ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాలు ఉన్నాయనేది విపక్షాల ప్రధాన ఆరోపణ.ఈడీ దర్యాప్తు సరళిని పరిశీలిస్తే.. ఏజెన్సీలు ఎప్పుడూ కిందిస్థాయి నుండి పైస్థాయికి వ్యూహాన్ని అనుసరిస్తాయి. ముందుగా కేటాయింపులు పొందిన డిస్టిలరీలు, రవాణా కాంట్రాక్టర్లు, వసూలు ఏజెంట్ల వద్ద నుంచి సేకరించిన రికార్డులు, వాట్సాప్ చాట్లు, గూగుల్ టేక్-అవుట్ డేటాను విశ్లేషించి మనీ ట్రయల్ ను నిర్ధారిస్తాయి. ఇప్పటికే జగన్ ముఖ్య కార్యదర్శి ధనంజయ్ రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి , మిథున్ రెడ్డి వంటి అత్యంత ఆప్తుల ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహించి కీలక పత్రాలు దక్కించుకోవడం ద్వారా, ఈ కేసు దారంతా చివరికి వైఎస్ జగన్ చుట్టూనే తిరిగేలా పావులు కదుపుతున్నారు. లిక్కర్ పాలసీ మార్పుల ద్వారా వచ్చిన రూ.1,048 కోట్లకు పైగా కిక్‌బ్యాక్‌ల నిధులు హవాలా మార్గాల్లో, షెల్ కంపెనీల ద్వారా ఎక్కడికి మళ్లాయనే సాంకేతిక ఆధారాలను ఈడీ సేకరిస్తోంది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో కూడా సరిగ్గా ఇదే తరహాలోనే కిందిస్థాయి అధికారుల నుంచి మొదలై చివరికి నాటి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ దాకా దర్యాప్తు ముడిపడి అరెస్టులకు దారితీసింది. ఇప్పుడు ఏపీలో కూడా ఈడీ అదే మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద బలమైన ఆధారాలు పొందుపరిస్తే, జగన్‌కు నోటీసులు జారీ చేయడం లేదా విచారణకు పిలవడం అనివార్యంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.మాజీ ముఖ్యమంత్రి స్థాయి నాయకుడిని నేరుగా అరెస్ట్ చేయడమనేది కేవలం ఆరోపణల ఆధారంగా సాధ్యపడదు. ఆయనకు నేరుగా లబ్ధి చేకూరినట్లు డైరెక్ట్ మనీ ఫ్లో సాక్ష్యాధారాలు కోర్టు ముందు నిలబడేలా ఈడీ చూపించాల్సి ఉంటుంది. ఒకవేళ కేవలం అధికారుల ప్రమేయం మాత్రమే తేలితే.. పొలిటికల్ మాస్టర్‌మైండ్‌గా ఆరోపణలు చేసినప్పటికీ, ప్రత్యక్ష చట్టపరమైన చర్యల నుంచి జగన్ తప్పించుకునే వెసులుబాటు కూడా ఉంటుందని న్యాయ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈడీ రికార్డు స్థాయి కస్టడీ విచారణలు చూస్తుంటే.. రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాల్లో ఈ లిక్కర్ స్కామ్ భూకంపం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. ఒకవేళ మనీ ట్రయల్ ఆధారాలు జగన్‌కు నేరుగా ముడిపడితే.. అది వైఎస్ఆర్‌సీపీ భవిష్యత్తుకే కాకుండా, రాష్ట్ర రాజకీయ సమీకరణాలకే అతిపెద్ద టర్నింగ్ పాయింట్‌గా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# ల్యాండ్ పూలింగ్ అడుగులు

**గుంటూరు, సెప్టెంబర్ 23, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. రాజధాని విస్తరణ, మౌలిక వసతుల కల్పన కోసం నిర్వహిస్తున్న రెండో విడత భూసమీకరణ ప్రక్రియకు భూములిచ్చేందుకు రాజధాని ప్రాంత రైతులు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా వైకుంఠపురం గ్రామ పరిధిలోని మాదల కుటుంబం తమకు చెందిన 14.365 ఎకరాల భూమిని అమరావతి నిర్మాణం కోసం సీఆర్డీఏ కు అందజేసేందుకు అంగీకరించింది. రాజధాని నిర్మాణంలో భాగస్వామ్యం కావడం పట్ల ఆ రైతు కుటుంబ సభ్యులు తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు.రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాదల శ్రీనివాసరావు కుటుంబసభ్యులు సీఆర్డీఏ అదనపు కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్‌కు అధికారిక అంగీకార పత్రాలను అందజేశారు. ఈ సమీకరణలో భాగంగా మాదల శ్రీనివాసరావు నుంచి 4.395 ఎకరాలు, మాదల అప్పారావు నుంచి 4.985 ఎకరాలు, అలాగే మాదల రాంబాబు నుంచి 4.985 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ బి. కన్యాకుమారి, ఇతర అధికారులు పాల్గొని రైతులకు ధన్యవాదాలు తెలిపారు.నవ్యాంధ్ర రాజధాని నగరం ప్రపంచస్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న తరుణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ల్యాండ్ పూలింగ్‌కు భూములిచ్చిన మాదల కుటుంబ సభ్యులు కోరారు. రెండో విడత భూసమీకరణకు అమరావతి పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, రైతులు పూర్తిస్థాయిలో సహకరించి రాజధాని అభివృద్ధికి తోడ్పడాలని వారు విజ్ఞప్తి చేశారు.

# దసరా, దీవాళికి స్పెషల్ ట్రైన్స్...

**నెల్లూరు, సెప్టెంబర్ 23, పెన్ పవర్:** పండగలు వచ్చేస్తున్నాయ్.. వచ్చే నెలలో దసరా, దీపావళి రానున్నాయి. ఈ రెండు పండగల నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నారా? అయితే, మీకో గుడ్ న్యూస్.. పండగ ప్రయాణికులకు భారత రైల్వే శుభవార్త చెప్పింది.పండగల సమయంలో రైళ్లపై పెరగనున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా 100 ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ స్పెషల్ ట్రైన్లు నవంబర్ వరకు వివిధ మార్గాల్లో నడవనున్నాయి. ఇప్పటికే కొన్ని రైళ్లకు బుకింగ్స్ ప్రారంభమయ్యాయి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, అస్సాం, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలను కలుపుతూ ఈ ప్రత్యేక సర్వీసులను నడపనున్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల మీదుగా వెళ్లే పలు రైళ్లు ప్రయాణికులకు ఉపయోగపడనున్నాయి.

చర్లపల్లి--నాగర్‌కోయిల్ (07535) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 23 వరకు ప్రతి శుక్రవారం నడుస్తుంది. నల్లగొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, చెన్నై ఎగ్మోర్, తిరుచిరాపల్లి తదితర స్టేషన్లలో ఆగుతుంది.

అలాగే, చర్లపల్లి--శ్రీకాకుళం (07037) రైలు అక్టోబర్ 6 నుంచి నవంబర్ 24 వరకు, తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం--చర్లపల్లి (07038) రైలు అక్టోబర్ 7 నుంచి నవంబర్ 25 వరకు సర్వీసులు అందించనున్నాయి. ఈ రైళ్లు నల్లగొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, విజయనగరం తదితర స్టేషన్లలో ఆగుతాయి.మరోవైపు.. ప్రయాగ్‌రాజ్--తిరునెల్వేలి (04171) ప్రత్యేక రైలు కూడా తెలుగు రాష్ట్రాల మీదుగా నడుస్తుంది. ఈ సర్వీసు రామగుండం, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు తదితర ప్రాంతాలను కలుపుతుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# మొన్నటి వరకూ ట్రంప్.. నేడు జెలెన్ స్కీ.. భారత్ పై పడి ఏడుపులేనా?




రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో భారత్ రష్యా నుంచి భారీగా ముడి చమురు కొనుగోలు చేస్తుండటంపై మరోసారి అంతర్జాతీయ స్థాయిలో చర్చ మొదలైంది. తాజాగా ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ భారత్‌ను నేరుగా ప్రస్తావిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యా ఆర్థిక వ్యవస్థకు భారత్, చైనా, టర్కీ వంటి దేశాల నుంచి జరుగుతున్న ఇంధన కొనుగోళ్లు ముఖ్యమైన మద్దతుగా నిలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

**భారత్ రష్యా చమురు కొనుగోళ్లు ఆపితే యుద్ధం ఆగుతుందా?**

ది వాల్ స్ట్రీట్ జర్నల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జెలెన్స్కీ మాట్లాడుతూ.. రష్యా ఆర్థిక వ్యవస్థ భారత్, చైనా, టర్కీ వంటి దేశాలతో ఇంధన వాణిజ్యంపై ఆధారపడుతోందని అన్నారు. ఈ దేశాలు రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లను నిలిపివేస్తే మాస్కోపై ఆర్థిక ఒత్తిడి పెరిగి, యుద్ధాన్ని కొనసాగించడం కష్టమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.జెలెన్స్కీ వ్యాఖ్యల ప్రకారం.. భారత్, చైనా వంటి ప్రధాన కొనుగోలుదారులు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గించడం లేదా నిలిపివేయడం ద్వారా రష్యా ఆదాయంపై ప్రభావం చూపవచ్చని ఉక్రెయిన్ భావిస్తోంది. అయితే ఇది జెలెన్స్కీ చేసిన రాజకీయ, వ్యూహాత్మక విజ్ఞప్తి అన్న విషయాన్ని కూడా గమనించాలి.

**ట్రంప్ తర్వాత జెలెన్స్కీ**

రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంలో భారత్‌పై ఒత్తిడి తెస్తున్న వారిలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఉన్నారు. తాజాగా ట్రంప్ రష్యా, ఇరాన్‌పై ఆంక్షలకు సంబంధించిన చట్టంపై సంతకం చేశారు. ఈ చట్టం ద్వారా రష్యా చమురు, గ్యాస్‌ను భారీగా కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అవకాశం అమెరికా అధ్యక్షుడికి లభించింది. భారత్, చైనా వంటి దేశాలు ఈ నిబంధనల పరిధిలోకి వచ్చే అవకాశం ఉంది.దీంతో ఒకవైపు అమెరికా నుంచి ఆర్థిక ఒత్తిడి.. మరోవైపు ఉక్రెయిన్ నుంచి దౌత్యపరమైన విజ్ఞప్తులు భారత్‌కు ఎదురవుతున్నాయి. అయితే భారత్ మాత్రం రష్యా నుంచి చమురు కొనుగోళ్ల విషయంలో తన నిర్ణయాలు దేశ ఇంధన భద్రత, మార్కెట్ పరిస్థితులు, వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తీసుకుంటామని చెబుతోంది.

**తగ్గుతున్న రష్యా చమురు దిగుమతులు**

ఇదిలా ఉండగా భారత్ ఇప్పటికే రష్యా నుంచి దిగుమతి చేసుకునే ముడి చమురు పరిమాణాన్ని కొంత తగ్గించింది. 2026 ఆగస్టులో రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకున్న చమురు రోజుకు సుమారు 2.1 మిలియన్ బ్యారెళ్లకు పడిపోయింది. సెప్టెంబర్‌లో ఇది సుమారు 1.9 మిలియన్ బ్యారెళ్లకు తగ్గే అవకాశం ఉందని ప్రాథమిక డేటా సూచిస్తోంది. అయినప్పటికీ రష్యా ఇప్పటికీ భారత్‌కు అతిపెద్ద చమురు సరఫరాదారుగా కొనసాగుతోంది.

**భారత్ ముందు ఇంధన భద్రత సవాలు**

రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేయడం భారత్‌కు అంత సులభమైన నిర్ణయం కాదు. ప్రత్యామ్నాయ దేశాల నుంచి చమురు దిగుమతులు పెంచడం వల్ల ఖర్చులు పెరగడంతో పాటు అంతర్జాతీయ చమురు మార్కెట్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. అందుకే భారత్ రష్యా చమురుతో పాటు ఇతర దేశాల నుంచి కూడా సరఫరాలను విస్తరించే దిశగా అడుగులు వేస్తోంది.
మొత్తంగా చూస్తే.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రభావం ఇప్పుడు కేవలం యుద్ధభూమికే పరిమితం కాకుండా అంతర్జాతీయ ఇంధన వాణిజ్యం, ఆంక్షలు, టారిఫ్‌లు, దౌత్య సంబంధాలపై కూడా పడుతోంది. ఈ నేపథ్యంలో భారత్ తీసుకునే తదుపరి నిర్ణయాలు అంతర్జాతీయంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# ఏఐ మాయలో మన 'బ్రెయిన్'.. మనల్ని తెలివితక్కువ వాళ్లుగా మారుస్తోందా?



ఈ రోజుల్లో ఏదైనా చిన్న సందేహం వస్తే చాలు.. పక్కనున్న వాళ్లను అడగడం మానేసి.. వెంటనే చాట్ జీపీటీని పలకరిస్తున్నాం. ప్రేమలేఖల దగ్గరి నుంచి ఆఫీస్ మెయిల్స్, ఆఖరికి లంచ్ బాక్స్‌లోకి ఏం వండుకోవాలో చెప్పేందుకు కూడా 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (ఏఐ) మన జీవితాల్లోకి దూసుకొచ్చింది. అయితే ఈ స్మార్ట్ సమాధానాల వెనుక మన సొంత జ్ఞానం 'డిలీట్' అయిపోతుందా? అంటే.. "అవుననేలా ఉన్నాయి" కొన్ని తాజా పరిశోధనలు..

ప్రఖ్యాత మాసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ ) మీడియా ల్యాబ్ వారు "యువర్ బ్రెయిన్ ఆన్ చాట్ జీపీటీ" అనే పేరుతో ఓ ఆసక్తికరమైన ప్రయోగాన్ని నిర్వహించారు. దీనికోసం 54 మందిని పిలిచి మూడు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ 1లో పూర్తిగా చాట్ జీపీటీ సహాయంతో వ్యాసాలు రాశారు. గ్రూప్ 2లో సెర్చ్ ఇంజిన్ గూగుల్ వాడుతూ సొంతంగా రాశారు. గ్రూప్ 3లో ఎటువంటి సాధనాలు లేకుండా కేవలం తమ సొంత మెదడునే వాడి వ్యాసాలు పూర్తి చేశారు.వీరందరి మెదడు కదలికలను ఈఈజీ పరికరంతో పరిశీలిస్తే షాకింగ్ విషయాలు బయటపడ్డాయి. సొంతంగా ఆలోచించి రాసిన మూడో గ్రూప్ వారి మెదడులో న్యూరాన్లు దీపావళి బాణసంచాలా ధగధగమెరిసిపోగా ఏఐ వాడిన మొదటి గ్రూప్ వారి మెదడులో మాత్రం తీవ్రమైన 'శాంతి సమాధానాలు' అంటే చాలా తక్కువ కనెక్టివిటీ కనిపించాయి!

**నేను రాసిందెంతో.. నాకు గుర్తుందే ఎంతో..**

ఈ రీసెర్చ్‌లో మరో విచిత్రమైన విషయం ఏమిటంటే.. ఏఐ సాయంతో వ్యాసం రాసిన వారిని "కొద్దిసేపటి క్రితం మీరేం రాశారో చెప్పండి?" అని అడిగితే.. వాళ్లు తెల్లముఖం వేశారు. తాము కాపీ-పేస్ట్ చేసిన విషయాలు కొద్ది నిమిషాల్లోనే మర్చిపోవడమే కాకుండా "ఇది అసలు నేనే రాశానా?" అనే అనుమానం కూడా వారిలో వ్యక్తమైంది. నాలుగు నెలల పాటు వరుసగా ఏఐ వాడిన వారిలో లాంగ్వేజ్, మెమరీ స్కిల్స్ తగ్గినట్లు పరిశోధకులు గుర్తించారు.మరి మనం నిజంగానే తెలివితక్కువ వాళ్లంగా మారిపోతున్నామా?
వెంటనే భయపడిపోయి ఏఐని పక్కన పడేయాల్సిన పనిలేదు. ఎందుకంటే ఈ అధ్యయనం ఇంకా ఆమోదముద్ర పడలేదు. పైగా కేవలం 54 మంది పైనే.. అదీ వ్యాస రచనపైనే ఈ ప్రయోగం చేశారు. కాబట్టి ప్రయోగాత్మకంగా ఇది తుది తీర్పు కాకపోవచ్చు.
కానీ ఇక్కడ మనం గమనించాల్సిన అసలు విషయమేమిటంటే.. ఏఐని మన ఆలోచనకు "ప్రత్యామ్నాయంగా" వాడితే మెదడు నిజంగానే తుప్పు పట్టిపోతుంది. అలా కాకుండా మన ఆలోచనలను "పదును పెట్టే సాధనంగా" వాడుకుంటే ఏ అభ్యంతరం లేదు. ఏఐ ఇచ్చే కాపీ-పేస్ట్ జ్ఞానాన్ని గుడ్డిగా నమ్మకుండా.. దాన్ని ప్రశ్నిస్తూ విశ్లేషిస్తూ మన 'కార్టెక్స్'కు కొద్దిగా పని పెడితేనే మన మెదడు సేఫ్.. లేకపోతే భవిష్యత్తులో "నా పేరు ఏంటో కాస్త చాట్ జీపీటీ ని అడిగి చెప్పు బాస్" అనే రోజులు వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

# యూఏఈలో భారతీయ ఎన్నారై దారుణ హత్య: 9 ముక్కలుగా నరికి కారులో పడేసిన వైనం.. భార్య, కుమారుడు మిస్సింగ్!

విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసే మరో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో నివాసముంటున్న కర్ణాటకకు చెందిన ఓ భారతీయ ఎన్నారై దారుణ హత్యకు గురయ్యారు. ఉడుపి జిల్లాకు చెందిన అల్విన్ ప్రకాశ్ కుందర్ (38) అనే వ్యక్తిని గుర్తుతెలియని దుండగులు అత్యంత అమానుషంగా హత్య చేసి ఆయన మృతదేహాన్ని తొమ్మిది ముక్కలుగా నరికి రెండు సంచుల్లో కుక్కి కారులో పడేసిన ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది.

**అసలేం జరిగింది?**

ఉడుపికి చెందిన అల్విన్ ప్రకాశ్ కుందర్ గత 14 సంవత్సరాలుగా షార్జా విమానాశ్రయంలో ఉద్యోగం చేస్తున్నారు. ఆయన భార్య టీనా ఓ స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా వీరికి పదో తరగతి చదువుతున్న ఒక కుమారుడు ఉన్నాడు. జులై నెలలో ఈ కుటుంబం షార్జా నుంచి భారత్‌కు రావడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. అయితే జులై 20న అల్విన్ సోదరుడు అనిల్ ప్రశాంత్ కుందర్ ఆయనకు ఫోన్ చేయగా కాల్ ఎత్తకుండా కేవలం ఒక టెక్స్ట్ మెసేజ్ మాత్రమే వచ్చింది. సాధారణంగా ఎప్పుడూ వాయిస్ మెసేజ్ పంపే అల్విన్.. ఆ రోజు భిన్నంగా మెసేజ్ చేయడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది.



వారం రోజుల తర్వాత కూడా ఎలాంటి సమాచారం లేకపోవడంతో అనిల్ షార్జాలోని అల్విన్ స్నేహితుడికి ఫోన్ చేసి విషయాన్ని పంచుకున్నారు. ఆ స్నేహితుడు అల్విన్ నివాసానికి వెళ్లి వాచ్‌మన్‌ను విచారించగా.. ఆ కుటుంబం ఇప్పటికే భారత్‌కు వెళ్లిపోయిందని చెప్పాడు. అయితే అల్విన్ పనిచేస్తున్న సంస్థ హెచ్ఆర్ విభాగాన్ని సంప్రదించి, పాస్‌పోర్టు ప్రయాణ వివరాలను పరిశీలించగా ఆయన యూఏఈ వదిలి వెళ్లలేదని నిర్ధారణ అయింది.

**దర్యాప్తులో షాకింగ్ విషయాలు**

దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఉడుపి పోలీసులను ఆశ్రయించడంతో పాటు, అక్కడ మిస్సింగ్ ఫిర్యాదు నమోదు చేయించారు. స్థానిక పోలీసులు, యూఏఈ అధికారుల సహాయంతో దర్యాప్తు ప్రారంభించగా షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఒమన్ హైవే వైపు పార్క్ చేసి ఉన్న ఒక అనుమానాస్పద కారులో అల్విన్ మృతదేహ భాగాలు లభ్యమయ్యాయి. దుండగులు ఆయన శరీరాన్ని 9 భాగాలుగా ఖండించి, రెండు వేర్వేరు సంచుల్లో నింపి కారులో వదిలేసినట్లు అధికారులు గుర్తించారు.

**భార్య, కుమారుడి ఆచూకీ గాల్లోనే**

ఈ హత్య కేసులో మరో ఆందోళనకరమైన విషయం ఏమిటంటే.. హత్య జరిగినప్పటి నుంచి అల్విన్ భార్య టీనా, వారి కుమారుడు కనిపించకుండా పోయారు. వారిద్దరి ఆచూకీ ఇంకా లభించకపోవడంతో ఈ దారుణంలో వారి ప్రమేయం ఏదైనా ఉందా లేదా వారు కూడా ప్రమాదంలో ఉన్నారా అనే కోణంలో పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. అల్విన్ దంపతుల మధ్య ఎలాంటి గొడవలు ఉన్నట్లు తమకు తెలియదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.
ప్రస్తుతం యూఏఈ అధికారులు, కర్ణాటక పోలీసులు ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుపుతున్నారు. ఈ దారుణానికి ఒడిగట్టింది ఎవరు? హత్య వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటి? భార్యాపిల్లలు ఎక్కడ ఉన్నారు? అనే ప్రశ్నలకు పోలీసుల పూర్తి నివేదిక వచ్చాకే స్పష్టత రానుంది.

## సాయికృష్ణ కేసుపై సుప్రీం సంచలన నిర్ణయం.. పోలీసులపై తీవ్ర వ్యాఖ్యలు



రాష్ట్రంలో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసు దర్యాప్తు తీరును తప్పుబడుతూ సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. హైకోర్టులో జరుగుతున్న విచారణపై స్టే విధించింది. సెప్టెంబరు 30లోగా కేసు వివరాలను సీల్డ్ కవర్ లో సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాకుండా హైకోర్టులో సాయికృష్ణ కేసుకు సంబంధించిన అన్ని పిటిషన్లను తమకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.కేసు తదుపరి విచారణను అక్టోబర్ 12కు వాయిదా వేసింది.గాదె సాయికృష్ణ కేసులో సుప్రీం వ్యాఖ్యలు తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి. వైసీపీ ఎంపీ గురుమూర్తి వేసిన పిటిషన్ ఆధారంగా విచారణ జరిపిన సుప్రీంకోర్టు రాష్ట్ర పోలీసులకు పలు ప్రశ్నలు సంధించింది. సాయికృష్ణ మిస్సింగ్ పై ఆయన తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని నిలదీసింది. డీజీపీ ఏం చేస్తున్నారని ప్రశ్నించడంతోపాటు పోలీసు స్టేషన్ పర్యవేక్షించాల్సిన ఏసీపీపైనా ఘాటు వ్యాఖ్యలు చేసినట్లు చెబుతున్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం, సీసీటీవీ ఫుటేజ్ ధ్వంసం చేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించిందని అంటున్నారు.సాయికృష్ణ కేసుపై సుప్రీంకోర్టు ఆదేశాలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఈ కేసు ఇప్పటికే తీవ్ర రాజకీయ దుమారం చెలరేగింది. ప్రభుత్వ జోక్యంతో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసి సాయికృష్ణ మిస్సింగ్ మిస్టరీని ఛేదించినప్పటికీ వైసీపీ మాత్రం జరిగిన ఘటనను తేలిగ్గా తీసుకోవడం లేదని అంటున్నారు. బాధితులకు న్యాయం చేయడంతోపాటు రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ గాడి తప్పిందనే చర్చను జాతీయస్థాయికి తీసుకువెళ్లేందుకు విపక్షం పకడ్బందీగా వ్యూహరచన చేస్తోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ మే 9 నుంచి అదృశ్యమయ్యారు. ఆయన్ను మార్కాపురం నుంచి విజయవాడకు తీసుకొచ్చిన పోలీసులు అక్రమంగా నిర్బంధించారని ఆరోపణలు ఉన్నాయి.సాయికృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత ఎంతకీ కోర్టులో హాజరుపరచకపోవడం, ఆయన ఆచూకీ లభించకపోవడంతో తల్లి విజయలక్ష్మి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. కస్టడీలోనే తమ కుమారుడిని చిత్రహింసలు పెట్టి హత్య చేశారని, మృతదేహాన్ని మాయం చేశారని తల్లి ఆరోపించడంతో ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో సాయికృష్ణ అదృశ్యం కేసులో మిస్టరీ ఛేదించేందుకు ప్రభుత్వం ఐజీ రవిప్రకాష్ నేతృత్వంలో సిట్ వేయగా, అప్పటి కృష్ణలంక సీఐ నాగరాజుతోపాటు మరికొందరు హెడ్ కానిస్టేబుళ్లు కలిసి సాయికృష్ణను చిత్రహింసలకు గురిచేసినట్లు సిట్ పోలీసులు ఆధారాలు సంపాదించినట్లు చెబుతున్నారు. దీనిపై తాజాగా కోర్టులో చార్జిషీటు కూడా దాఖలు చేశారు. మార్కాపురం నుంచి సాయికృష్ణను తీసుకువచ్చిన పోలీసులు విజయవాడలో ఒక పాడబడిన భవనంలో చిత్రహింసలకు గురిచేశారని, పోలీసు దెబ్బల వల్ల అతడు మృతి చెందాడని సిట్ కోర్టుకు తెలియజేసింది. దీంతో కేసు కొలిక్కి వచ్చినట్లుగా భావిస్తున్న తరుణంలో సుప్రీంకోర్టు జోక్యంతో అనూహ్య మలుపుతిరిగిందని అంటున్నారు. ఎంపీ గురమూర్తి ఫిర్యాదుపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు కేసును తామే పర్యవేక్షిస్తామని తేల్చిచెప్పడం సంచలనం సృష్టిస్తోందని అంటున్నారు.

## గ్లోబల్ ఇమేజ్‌పై డిజిటల్ డ్యామేజ్.. ఒకరి చర్యలతో మొత్తం కమ్యూనిటీపై ప్రభావం



సోషల్ మీడియాలో కొన్ని లైక్లు, వ్యూస్ కోసం హద్దులు దాటి ప్రవర్తించడం ఈ రోజుల్లో పెద్ద ఫ్యాషన్‌గా మారింది. దుబాయ్ బీచ్‌లో బంగ్లాదేశ్ కంటెంట్ క్రియేటర్ ఇమ్రాన్ హొస్సేన్ ఓ విదేశీ మహిళను అనుమతి లేకుండా వీడియో తీస్తూ, ఆమెను కావాలనే తాకిన ఘటన తీవ్ర దుమారం రేపుతోంది. ఒకరి వికృత చేష్టల వల్ల విదేశాల్లో నివసించే ఆయా దేశాల ప్రజల పట్ల, దక్షిణాసియా కమ్యూనిటీపై సోషల్ మీడియా సమాజం చూసే కోణమే మారిపోతోంది..ఆ వివరాలు చూద్దాం..

**వ్యూస్ పిచ్చి తెచ్చిన విపత్తు:**

ఆధునిక డిజిటల్ ప్రపంచంలో వైరల్ అవ్వడమే ఏకైక లక్ష్యంగా మారడంతో క్రియేటర్లు తమ విలువలను, కనీస మానవ హక్కులను మర్చిపోతున్నారు. దుబాయ్ లాంటి పటిష్టమైన చట్టాలున్న దేశంలో పబ్లిక్ బీచ్‌లోకి వెళ్లి మహిళల అనుమతి లేకుండా వీడియోలు తీయడం, కావాలనే వారి వ్యక్తిగత ప్రైవసీకి భంగం కలిగించడం అత్యంత నిందించదగ్గ విషయం. ఇక ఇది కేవలం ఒక క్రియేటర్ చేసిన తప్పు మాత్రమే కాదు, డిజిటల్ దురాశ మనుషులను ఎంతలా దిగజార్చుతుందో చెప్పే చేదు నిజం.

**ఒకరి తప్పు.. కమ్యూనిటీకి శిక్ష:**

విదేశాల్లో పనిచేసే వలసదారులు లేదా టూరిస్టులు చాలా క్రమశిక్షణతో, కష్టపడి తమ గుర్తింపును నిర్మించుకుంటారు. కానీ ఇమ్రాన్ లాంటి ఒకరిద్దరు ఆకతాయిలు చేసే ఇలాంటి పనుల వల్ల అక్కడి స్థానికులలో, ప్రభుత్వం దృష్టిలో ఆ దేశానికి చెందిన మొత్తం పౌరులపై చెడు అభిప్రాయం ఏర్పడుతుంది. "ఒక్క చుక్క విషం పాలు మొత్తాన్ని పాడుచేసినట్లు", ఒకరి వికృత చర్య వల్ల ఆసియా దేశాల నుంచి వచ్చిన మిగతా క్రియేటర్లు, టూరిస్టుల ఇమేజ్ తీవ్రంగా దెబ్బతింటోంది.

**చెరిగిపోని డిజిటల్ ఫుట్‌ప్రింట్:**

నెటిజన్ల నుంచి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం కావడంతో ఆ క్రియేటర్ తన అకౌంట్ నుంచి వీడియోను డిలీట్ చేసినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. సోషల్ మీడియా యుగంలో డిజిటల్ ఫుట్‌ప్రింట్ అనేది చాలా పవర్ ఫుల్. ఇక నెటిజన్లు ఆ వీడియోను స్క్రీన్ రికార్డ్ చేసి ఇతర ప్లాట్‌ఫామ్‌లలో వైరల్ చేస్తూ, కఠిన చర్యలు తీసుకోవాలని దుబాయ్ పోలీసులను ట్యాగ్ చేస్తున్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యుగంలో తప్పు చేసి తప్పించుకోవడం సాధ్యం కాదని ఇది స్పష్టం చేస్తోంది.

**గ్లోబల్ టూరిజంలో భద్రతా ముప్పు:**

పర్యాటకరంగంలో ప్రపంచంలోనే అత్యుత్తమ భద్రత కలిగిన నగరంగా దుబాయ్‌కి మంచి పేరుంది. అయితే, ఇలాంటి సంఘటనలు విదేశీ మహిళలకు భద్రతా పరమైన ఆందోళనలను కలిగిస్తాయి. ఇక ఫలితంగా దుబాయ్ సైబర్ చట్టాల ప్రకారం ఇతరుల ప్రైవసీని దెబ్బతీసే వారిపై భారీ జరిమానాలు, జైలు శిక్షలు, దేశం నుంచి పంపించివేసే కఠిన నిబంధనలను మరింత పగడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఏర్పడింది.

**క్రియేటివిటీకి హద్దులు ఉండాలి:**

సోషల్ మీడియా క్రియేటర్లు తమ వినోదం లేదా వ్యూస్ కోసం ఎదుటివారి స్వేచ్ఛను, గౌరవాన్ని బలిపెట్టడం ఎంత మాత్రం సరికాదు. గ్లోబల్ వేదికలపై మన ప్రవర్తనే మన దేశానికి, మన సంస్కృతికి అద్దం పడుతుంది. వ్యక్తిగత ప్రచార పిచ్చి కోసం కమ్యూనిటీ గౌరవాన్ని తాకట్టు పెట్టే క్రియేటర్లపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడే డిజిటల్ ప్రపంచంలో ఇతరుల ప్రైవసీకి రక్షణ దక్కుతుంది.

## అధికార వారసత్వ ప్రశ్న!

రష్యాలో మరోసారి వ్లాదిమిర్ పుతిన్ పార్టీదే హవా. పుతిన్‌కు చెందిన 'యునైటెడ్ రష్యా' పార్టీ 57.83 శాతం ఓట్లు సాధించింది. 2021లో వచ్చిన 49.8 శాతంకంటే ఇది గణనీయమైన పెరుగుదల. 450 స్థానాలున్న డూమా (దిగువసభ)లో, గతంలో ఉన్న 324 స్థానాలనుంచి ఇప్పుడు 355 స్థానాలకు ఈ పార్టీ ఎదగనుంది. ఇది రాజ్యాంగాన్ని సవరించగల మూడింట రెండొంతుల మెజారిటీ, పార్టీ చరిత్రలోనే అతిపెద్ద విజయం. పోలింగ్ శాతం 59.3గా నమోదైంది. ఉక్రెయిన్‌పై యుద్ధానికి తమ మద్దతును పరీక్షించే సందర్భంగా ఈ ఎన్నికను పుతిన్ అభివర్ణించగా, ఇప్పుడు క్రెమ్లిన్ ఈ ఫలితాన్ని ప్రజలనుంచి వచ్చిన సమాధానంగా చాటుకోనుంది. ఆగస్టులో, యుద్ధాన్ని బహిరంగంగా వ్యతిరేకించే ఏకైక నమోదిత పార్టీ అయిన లిబరల్ 'యాబ్లోకో' జాతీయ జాబితాను రష్యా సుప్రీంకోర్టు బ్యాలెట్‌నుంచి తొలగించింది. మిగిలిన పది పార్టీలూ యుద్ధానికి మద్దతిచ్చేవే. రష్యాలో ఏకైక స్వతంత్ర ఎన్నికల పర్యవేక్షణ సంస్థ 'గోలోస్', దాని సహ అధ్యక్షుడు గ్రిగొరీ మెల్కోన్యాంట్స్‌కు ఐదేళ్ల జైలు శిక్ష పడిన అనంతరం 2025లోనే మూతపడింది. ఓఎస్‌సీఈ పరిశీలకులకు ఆహ్వానమే లేదు. మూడు రోజులపాటు సాగిన పోలింగ్‌లో, 33 ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ బ్యాలెట్లు వినియోగించగా, పరిశీలకులను అదుపులోకి తీసుకున్నారని, మాస్కోలో ఓటర్లకు పేపర్ బ్యాలెట్లు నిరాకరించారని యాబ్లోకో ఆరోపించింది. ఆక్రమిత ఉక్రెయిన్ భూభాగాల్లోనూ పోలింగ్ నిర్వహించగా, దీన్ని యూరోపియన్ యూనియన్ ఒక బూటకమని పేర్కొంది. ఎన్నికల యంత్రాంగం మొత్తం ముందుగా నిర్ణయించిన ఫలితాన్ని ధృవీకరించే తంతుగానే మిగిలిపోయింది తప్ప, ప్రజాభిప్రాయాన్ని నిజాయితీగా ప్రతిబింబించే వేదికగా పనిచేయలేదు.

కమ్యూనిస్టు పార్టీ 13.81 శాతం, ఎల్‌డీపీఆర్ 8.98 శాతం, న్యూ పీపుల్ 7.96 శాతం ఓట్లు సాధించాయి. కాగితంపై చూస్తే ఇది బహుళత్వంలా కనిపిస్తుంది. కానీ ఆచరణలో, పెద్ద విషయాలపై ఈ పార్టీలన్నీ యునైటెడ్ రష్యాతోనే గొంతు కలుపుతాయి. బ్యాలెట్ పేపర్‌ను రద్దీగా చూపించడానికే ఇవి ఉనికిలో ఉన్నాయి తప్ప, ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని అందించడానికి కాదు. రష్యాలో ప్రజాస్వామ్యం పనిచేసే తీరు ఇదే, రూపాలను కాపాడుతూ, సారాంశాన్ని తొలగించడం. ఇక్కడ లోపించిన అసలైన అంశం అనిశ్చితి. అధ్యక్ష పదవిని డూమా తనిఖీ చేయదు, కేవలం దాని నిర్ణయాలపై ముద్ర వేస్తుంది. పుతిన్ స్వయంగా యునైటెడ్ రష్యా పార్టీలో సభ్యుడు కూడా కాదు. దీనివల్ల తాను నడిపిస్తున్న యంత్రాంగానికి ఆయన అతీతంగా నిలబడగలుగుతున్నారు. ఇప్పుడు అసలైన ప్రశ్న –ఆయన వైదొలిగితే ఏమవుతుంది? వచ్చే నెల పుతిన్ వయసు 74 నిండనుంది. ఆయన ప్రస్తుత పదవీకాలం 2030 వరకూ ఉండగా, 2020లో చేసిన రాజ్యాంగ సవరణలు ఆయనను 2036 వరకూ, అంటే 83 ఏళ్ల వయసు వచ్చేదాకా అధికారంలో కొనసాగేందుకు అనుమతిస్తాయి. ఇన్నేళ్లుగా ఏ ప్రత్యర్థినీ ఎదగనివ్వకపోవడంతో, స్పష్టమైన వారసుడు అంటూ ఎవరూ లేరు. రాజ్యాంగం ప్రకారం ప్రధాని మిఖాయిల్ మిషుస్టిన్ తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపడతారు, కానీ భద్రతా వర్గాల్లో ఆయనను ఒక 'బయటి వ్యక్తి'గానే చూస్తారు. దీర్ఘకాలంగా క్రెమ్లిన్ అధికార కేంద్రానికి దూరంగా, పరిపాలనా వ్యవహారాలకే పరిమితమైన నేపథ్యం ఆయనకు ఉండటమే దీనికి కారణం. భద్రతా మండలి కార్యదర్శి, పుతిన్ మాజీ బాడీగార్డ్ అయిన అలెక్సీ డ్యుమిన్‌వంటి పేర్లు తరచూ చర్చల్లోకి వస్తున్నాయి. అయితే ఈ వారసత్వ పోటీలో ఉన్నవారంతా పుతిన్ నేపథ్యాన్ని, ఆయన భయాలనే పంచుకునే చిన్నవర్గమే. ఎక్కువమంది గూఢచర్య, భద్రతా వ్యవస్థల నుంచి ఎదిగినవారే కావడం గమనార్హం.

ఈ కొత్తగా వచ్చిన సూపర్ మెజారిటీని వారసత్వ బీమాగా చూడొచ్చు. ఇంతటి విధేయమైన డూమా, లోపలి వర్గం ఏకాభిప్రాయానికి వచ్చిన దేన్నయినా ఆమోదముద్ర వేయగలదు, ఎంపిక చేసిన వారసుడి నుంచి, పూర్తిగా తిరగరాసిన నిబంధనావళి వరకూ ఏదైనా సరే. ఇక్కడ ప్రమాదం ప్రజాస్వామ్యబద్ధమైన అధికార మార్పిడి కాదు, మధ్యవర్తి వైదొలిగినప్పుడు వర్గాల మధ్య చెలరేగే అధికార పోరు. అయిదో ఏడాదిలోకి అడుగుపెట్టిన యుద్ధంతో అల్లాడుతున్న దేశంలో, తమ ఓటర్లను ఎప్పుడూ ఎంపిక చేసుకునే అవకాశమే అడగని పరిస్థితుల్లో ఇది జరగనుంది.

ఇలాంటి వ్యక్తి కేంద్రిత వ్యవస్థల్లో, అధికార బదిలీ ఎప్పుడూ ప్రశాంతంగా జరగదు. సోవియట్ యూనియన్ పతనం తర్వాత జరిగిన గందరగోళం, లేదా మధ్య ఆసియా దేశాల్లో నియంతల మరణం తర్వాత చెలరేగిన అధికార పోరాటాలు చరిత్రలో అనేక ఉదాహరణలుగా నిలుస్తాయి. రక్షణ, ఇంధన రంగాల్లో మాస్కోతో లోతైన సంబంధాలున్న భారత్, దీన్ని ఇతరుల సమస్యగా కొట్టిపారేయలేదు. వ్యక్తి కేంద్రిత వ్యవస్థలు, అధికార మార్పిడి సమయంలోనే అత్యంత బలహీనంగా మారతాయి. అందుకే, న్యూఢిల్లీ నేటి మాస్కో సంస్థలతో వ్యవహరిస్తూనే, అగ్రస్థానంలో ఉన్న వ్యక్తి తప్పుకునే రోజు కోసం కూడా సిద్ధమవ్వాలి. దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యం, కేవలం ఒక్క నాయకుడి వ్యక్తిగత సంబంధాలపైనే ఆధారపడకూడదు. సంస్థాగత సంబంధాలను బలోపేతం చేసుకోవడం, భవిష్యత్తులో ఎలాంటి నాయకత్వ మార్పు వచ్చినా తట్టుకునేలా భారత విదేశాంగ విధానాన్ని సిద్ధం చేసుకోవడం ఇప్పుడు అత్యవసరమైన పని.

రష్యావంటి భౌగోళిక రాజకీయంగా కీలకమైన దేశంతో సంబంధాలు కేవలం ఒక్క వ్యక్తిపైనే ఆధారపడితే, ఆ వ్యక్తి తర్వాత ఏర్పడే అనిశ్చితి, భారత ప్రయోజనాలను కూడా దెబ్బతీసే ప్రమాదముంది. అందుకే దూరదృష్టితో కూడిన దౌత్యనీతే అవసరం. భవిష్యత్తులో అధికార మార్పిడి సమయంలో మాస్కో విధానాలు ఎలా మారవచ్చో ముందుగానే అంచనా వేసుకోవడం, ప్రత్యామ్నాయ వ్యూహాలను సిద్ధం చేసుకోవడం విజ్ఞత. ఒకవైపు వాణిజ్య, రక్షణ ఒప్పందాలను కొనసాగిస్తూనే, మరోవైపు రష్యాలో పెరుగుతున్న అంతర్గత ఒత్తిళ్లను నిశితంగా గమనించాల్సిన బాధ్యత భారత విదేశాంగ శాఖపై ఉంది. ఒక వ్యక్తి చుట్టూ కేంద్రీకృతమైన వ్యవస్థలు ఎప్పుడు కుప్పకూలుతాయో ఊహించడం కష్టమే అయినా, ఆ అనిశ్చితికి సిద్ధపడకపోవడం మరింత ప్రమాదకరం. నేటి స్నేహసంబంధాలను కాపాడుకుంటూనే, రేపటి అనిశ్చితికి తట్టుకునే బలమైన పునాదులు వేసుకోవడమే భారత్‌కు నిజమైన వివేకం.

## పనికొచ్చే పలుకు



## మార్పు మొత్తం ఆ అడుగుతోనే..!

లైఫ్‌లో కొన్ని మార్పులు చేయాలనుకుంటాం. కానీ మార్పు ఎక్కడినుంచి మొదలుపెట్టాలో తెలీక చాలాసార్లు ఆగిపోతాం. ఉదయం లేవగానే వాకింగ్ చేయాలి. జిమ్‌కు వెళ్లాలి. డైట్ పాటించాలి. రాత్రి త్వరగా నిద్రపోవాలి. ఫోన్ వాడకం తగ్గించాలి. నీళ్లు ఎక్కువ తాగాలి. ఇలా లిస్ట్ పెరుగుతూనే ఉంటుంది. చివరికి.. 'ఇవన్నీ ఒకేసారి ఎలా సాధ్యం?' అనుకుని ఏదీ మొదలుపెట్టం. నిజానికి మన లైఫ్‌స్టైల్‌ను మార్చుకోవడానికి ఒకేసారి అన్నింటినీ మార్చాల్సిన అవసరం లేదు. ఒక్క అలవాటును మార్చడం మొదలుపెడితే.. మిగతా అలవాట్లు దాని వెంట రావడం మొదలవుతుంది. ఉదాహరణకు వ్యాయామాన్నే తీసుకుందాం. రోజూ కొంతసేపు నడవడం మొదలుపెడితే.. మనలో సహజంగానే ఒక ఆలోచన వస్తుంది. 'ఇంత కష్టపడి వ్యాయామం చేస్తున్నాను కదా.. మరి ఏది పడితే అది ఎందుకు తినాలి?' అని. అక్కడి నుంచే ఆహారంపై శ్రద్ధ మొదలవుతుంది. అలాగే ఆహార నియమాలను పాటించడం మొదలుపెడితే.. శరీరంలో తేలిక, చురుకుదనం కనిపిస్తుంది. అప్పుడు వ్యాయామం చేయాలనే ఆసక్తి పెరుగుతుంది. ఇదే అసలు విషయం. వ్యాయామం, ఆహారం రెండూ వేర్వేరు అలవాట్లు కావు.. ఒకదానిని మరొకటి నడిపించే రెండు చక్రాలు.

అయితే మనం చేసే పొరపాటు ఏమిటంటే.. రెండింటినీ ఒకేసారి పర్ఫెక్ట్‌గా చేయాలని ప్రయత్నించడం. సోమవారం నుంచి డైట్.. ఉదయం జిమ్.. సాయంత్రం వాకింగ్.. షుగర్ పూర్తిగా బంద్.. ఫాస్ట్‌ఫుడ్ నో.. రాత్రి 10కే నిద్ర.. అంటూ భారీ టార్గెట్ పెట్టుకుంటాం. నాలుగు రోజులు ఉత్సాహంగా చేస్తాం. ఐదో రోజు ఏదోకటి మిస్సవుతుంది. ఆ ఒక్క తప్పిదం తర్వాత 'మన వల్ల కాదు' అనే ఫీలింగ్ వచ్చేస్తుంది. నిజానికి –లైఫ్‌స్టైల్ చేంజ్‌కు పర్ఫెక్షన్ అవసరం లేదు.. కంటిన్యూటీ అవసరం. అందుకే ఒకేసారి మొత్తం జీవితాన్ని మార్చాలని ప్రయత్నించకుండా.. ఒక్క చిన్న నిర్ణయంతో మొదలుపెట్టండి. రోజుకు 20 నిమిషాలు నడవండి. లేదా రాత్రి భోజనం తర్వాత స్వీట్స్ వద్దనుకోండి. లేదా రోజుకు ఒక అదనపు గ్లాస్ నీళ్లు తాగండి. మొదటి అడుగు ఎంత చిన్నదైనా పర్వాలేదు. అది మనకు 'నేను మార్చుకోగలను' అనే నమ్మకాన్నిస్తుంది.

ఇది ముఖ్యంగా జెన్ జీకి చెప్పాల్సిన విషయం. మన చుట్టూ ఉన్న ప్రపంచం 'ఇన్‌స్టంట్'గా మారిపోయింది. ఒక క్లిక్‌తో ఫుడ్ ఆర్డర్.. ఒక టచ్‌తో ఎంటర్‌టైన్‌మెంట్.. కొన్ని సెకన్లలో రిజల్ట్ కావాలి. కానీ మన శరీరం, మనసు మాత్రం అలా పనిచేయవు. ఆరోగ్యకరమైన జీవితం ఒక యాప్ కాదు.. డౌన్‌లోడ్ చేసుకుని వెంటనే ఇన్‌స్టాల్ చేసుకునేది కాదు. అది రోజూ చేసే చిన్న చిన్న నిర్ణయాలతో నిర్మించుకునే లైఫ్‌స్టైల్.

ఒక మంచి అలవాటు మొదలైతే.. అది మన రోజును మార్చుతుంది. రోజు మారితే.. మన రొటీన్ మారుతుంది. రొటీన్ మారితే.. మన ఆలోచనా విధానం మారుతుంది. చివరికి మనం కోరుకున్న జీవనశైలి నెమ్మదిగా మన సహజ జీవనశైలిగా మారిపోతుంది. అందుకే 'ముందు అన్నీ సెట్ చేసుకుని మొదలుపెడతా' అని ఎదురుచూడకండి. మొదలుపెట్టిన తర్వాతే చాలా విషయాలు సెట్టవుతాయి. వ్యాయామంతో మొదలుపెట్టండి.. ఆహారం దారిలోకి వస్తుంది. ఆహారంతో మొదలుపెట్టండి.. వ్యాయామంపై ఆసక్తి పెరుగుతుంది. ఏదైనా ఒకటి ఎంచుకోండి. కానీ మొదటి అడుగు మాత్రం ఈరోజే వేయండి.

జీవితాన్ని మార్చేది పెద్ద నిర్ణయం కాదు.. రోజూ తీసుకునే చిన్న నిర్ణయమే. ఒక్క అడుగు చాలు.. మిగతా దారి దానంతట అదే కనిపిస్తుంది.

# పెళ్లి ఒప్పందంలో విడాకుల క్లాజు!



పెళ్లి కుదుర్చుకునేటప్పుడు విడాకుల గురించి ఎవరూ మాట్లాడరు. కానీ తెలివైన కుటుంబాలు మాత్రం ముందుగానే ఆ ఏర్పాట్లను స్పష్టం చేసుకుంటాయి. రేపేదైనా జరిగితే.. ఎవరికేం జరుగుతుందో తెలిస్తేనే, పెళ్లి బంధం మరింత భద్రంగా ఉంటుంది. భారత్ ఇప్పుడు ప్రపంచ దేశాలతో కుదుర్చుకుంటున్న వాణిజ్య, పెట్టుబడుల ఒప్పందాల విషయంలోనూ సరిగ్గా ఇదే జరుగుతోంది. యూఏఈ (2024), ఇజ్రాయెల్ (2025), ఉజ్బెకిస్తాన్ (2024)లతో ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందాలు (బీఐటీలు), న్యూజిలాండ్ (2026 ఏప్రిల్), బ్రిటన్ (2025 జులై), యూరోపియన్ స్వేచ్ఛా వాణిజ్య సంఘం (2024 మార్చి), ఒమన్ (2025 డిసెంబర్)లతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) కుదుర్చుకుంటూ, భారత్ తన దీర్ఘకాలిక చర్చల ఫలాలను అందుకుంటోంది. ఈ ఒప్పందాల గురించి జరిగే చర్చ ఎక్కువగా వాటి ఆర్థిక ప్రయోజనాలపైనే కేంద్రీకృతమవుతోంది. మార్కెట్ అందుబాటు, పెట్టుబడిదారు–రాజ్య వివాద పరిష్కార విధానం (ఐఎస్‌డీఎస్) ఉందా లేదా అనే అంశాలపైనే ఎక్కువ చర్చ జరుగుతుంది. కానీ తరచూ విస్మరించబడే కీలకమైన కోణం ఉంది, ఈ ఒప్పందాలు భారత్‌లోని వాణిజ్య మధ్యవర్తిత్వ వ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది. ఇది కేవలం న్యాయవాదులకు మాత్రమే సంబంధించిన సాంకేతిక అంశంగా కొట్టిపారేయకూడదు, ఎందుకంటే విదేశీ పెట్టుబడిదారుడు తన డబ్బును ఏ దేశంలో పెట్టాలో నిర్ణయించుకునేటప్పుడు, "సంబంధం విఫలమైతే ఏమవుతుంది?" అన్న ప్రశ్నకు నమ్మదగిన సమాధానం ఇవ్వగల దేశానికే మార్కులు పడతాయి.

భారత్‌వద్ద ఇప్పటికే ప్రాథమిక చట్టపరమైన మౌలిక సదుపాయం ఉంది. 1996 నాటి మధ్యవర్తిత్వ, రాజీ చట్టం దేశీయ మధ్యవర్తిత్వాన్ని, అంతర్జాతీయ వాణిజ్య మధ్యవర్తిత్వాన్ని, విదేశీ మధ్యవర్తిత్వ తీర్పుల అమలును కవర్ చేస్తుంది. ఇప్పుడు అసలైన ప్రశ్న ఏమిటంటే, భారత ఒప్పందాల విధానం ఈ మౌలిక సదుపాయాన్ని ఎలా మరింత బలోపేతం చేయగలదన్నదే. దీనికి సమాధానాలు వేర్వేరుగా ఉన్నాయి. మొదటిది –ఇటీవలి భారత ఎఫ్‌టీఏలు సాధారణంగా పెట్టుబడిదారు–రాజ్య వివాద పరిష్కార విధానాన్ని విస్మరిస్తున్నాయి. అయితే, భారత్‌లో వచ్చే పెట్టుబడుల్లో గణనీయమైన భాగం విదేశీ పెట్టుబడిదారులు, భారత ప్రభుత్వ సంస్థల మధ్య కుదిరే ఒప్పందాల ద్వారానే వస్తుంది కాబట్టి, భవిష్యత్తులో కుదిరే ఎఫ్‌టీఏలు ఈ విధానం వెనుక ఉన్న హేతుబద్ధతను మరింత స్పష్టంగా వివరించాల్సి ఉంటుంది. ఉదాహరణకు, యూరోపియన్ యూనియన్–ఆస్ట్రేలియా ఎఫ్‌టీఏ చర్చల సమయంలో, "ఇరు దేశాల న్యాయ వ్యవస్థలపై ఉన్న నమ్మకాన్ని బట్టి చూస్తే, పెట్టుబడుల రక్షణను ఈ ఒప్పందంలో చేర్చాల్సిన అవసరం లేదు" అని రెండు పక్షాలూ స్పష్టం చేసుకున్నాయి. ఇదే తరహాలో, భారత్‌లో అందుబాటులో ఉన్న వాణిజ్య మధ్యవర్తిత్వ పరిష్కారాల కారణంగానే ఐఎస్‌డీఎస్ లేకపోవడం సమంజసమని స్పష్టం చేసే నిబంధనలను లేదా ప్రవేశిక (ప్రియాంబుల్) పాఠాన్ని భారత్ తన భవిష్యత్ ఎఫ్‌టీఏల్లో చేర్చుకోవాలి. మధ్యవర్తిత్వ చట్టపరమైన చట్రాన్ని బలోపేతం చేసేందుకు ఇటీవలి శాసన సంస్కరణలతోపాటు, భారత న్యాయస్థానాల మధ్యవర్తిత్వ అనుకూల వైఖరి కూడా తోడైతే, రాజ్యం యొక్క ఐఎస్‌డీఎస్‌పై ఉన్న సందేహాలకు, విదేశీ పెట్టుబడిదారులు భారత న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు నడపకూడదన్న కోరికకు మధ్య ఒక మధ్యేమార్గాన్ని అందించగలదు.

రెండో అంశం –ఐఎస్‌డీఎస్ కలిగిన భారత బీఐటీలు, ఒప్పందం ఆధారిత మధ్యవర్తిత్వానికి, కాంట్రాక్టు ఆధారిత వాణిజ్య మధ్యవర్తిత్వానికి మధ్య స్పష్టమైన విభజన రేఖను గీస్తున్నాయి. ఉదాహరణకు, భారత్–ఉజ్బెకిస్తాన్ బీఐటీ, రాజ్యానికి, విదేశీ పెట్టుబడిదారుడికి మధ్య కుదిరిన ఒప్పందం ఉల్లంఘన నుంచి మాత్రమే పుట్టుకొచ్చిన వివాదాలను ఐఎస్‌డీఎస్ పరిధి నుంచి మినహాయిస్తుంది. ఇలాంటి ఒప్పందాలు, ఐఎస్‌డీఎస్‌ను ఆశ్రయించే ముందు దేశీయ పరిష్కారాలను పూర్తిగా వినియోగించుకోవాలన్న షరతునూ విధిస్తున్నాయి. నిర్దిష్ట కాలవ్యవధి పాటు తమ ఫిర్యాదులను హోస్ట్ దేశ న్యాయస్థానాలకు లేదా పరిపాలనా సంస్థలకు సమర్పించాలని విదేశీ పెట్టుబడిదారులను ఇవి కోరుతున్నాయి. అయితే ఈ నిబంధనల పదజాలం, భారత్‌లో ఉన్న వాణిజ్య మధ్యవర్తిత్వ ట్రిబ్యునళ్లను మినహాయించేలా కనిపిస్తోంది. దీనికి తగిన విధానపరమైన కారణం ఏదీ కనిపించదు. కాబట్టి, దేశీయ పరిష్కారాలను పూర్తిగా వినియోగించుకోవాలన్న షరతును, భారత్‌లోని వాణిజ్య మధ్యవర్తిత్వానికి తమ వివాద సారాంశాన్ని సమర్పించడం ద్వారా కూడా విదేశీ పెట్టుబడిదారులు నెరవేర్చుకోవచ్చని భవిష్యత్తు బీఐటీలు స్పష్టం చేయాలి. చివరిగా, ఇటీవలి భారత బీఐటీలు, ఐఎస్‌డీఎస్‌లో మూడో పక్షం నిధులను భారత ప్రభుత్వం ప్రోత్సహించదన్న విషయాన్ని సూచిస్తున్నాయి. ఐఎస్‌డీఎస్ క్లెయిములు సార్వభౌమ నిర్ణయాలను ప్రభావితం చేసి, రాజ్యాల నియంత్రణా విధాన నిర్ణయాలపై ఒక అణచివేత ప్రభావాన్ని కలిగించగలవు కాబట్టి, ఈ వైఖరి అర్థం చేసుకోదగినదే. కానీ ఈ పరిగణనలు భారత్‌లోని వాణిజ్య మధ్యవర్తిత్వానికి వర్తించవు. కాబట్టి, ఐఎస్‌డీఎస్‌లో మూడో పక్షం నిధులపై నిషేధం, భారత్‌లోని వాణిజ్య మధ్యవర్తిత్వంలో అలాంటి నిధులు అనుమతించరానివని సూచించదని భారత్ తన భవిష్యత్ బీఐటీలు, ఎఫ్‌టీఏలలో స్పష్టం చేయాలి. ఇది, అంతర్జాతీయ ఉత్తమ విధానాలకు అనుగుణంగా, దేశీయ వాణిజ్య మధ్యవర్తిత్వ వ్యవస్థకు సమగ్రమైన, పొందికైన విధానాన్ని అభివృద్ధి చేసేందుకు నియంత్రణా సంస్థలకు వీలు కల్పిస్తుంది.

చివరికి, తమ మూలధనాన్ని ఎక్కడ పెట్టుబడి పెట్టాలో నిర్ణయించుకునే పెట్టుబడిదారులు, కేవలం పన్ను రేట్లను, మార్కెట్ అందుబాటును మాత్రమే బేరీజు వేసుకోరు, సంబంధం విఫలమైతే ఏమవుతుందో కూడా ప్రశ్నిస్తారు. ఈ ప్రశ్నకు నమ్మదగిన సమాధానం ఇవ్వగల దేశానికి గణనీయమైన ఆర్థిక ప్రయోజనం లభిస్తుంది. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్‌లలో డిజిటల్ మౌలిక సదుపాయాలు, కృత్రిమ మేధ ఆధారిత కేస్ మేనేజ్‌మెంట్‌తో జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ప్రణాళిక, 2030 నాటికి ఆసియాలో ఆకర్షణీయమైన మధ్యవర్తిత్వ కేంద్రంగా భారత్‌ను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇప్పుడు అవకాశం ఏమిటంటే, ఆ ఒప్పంద విధానాన్ని, భారత్‌లో వాణిజ్య మధ్యవర్తిత్వాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో అనుసంధానించడమే. లక్ష్యం సూటిగా ఉండాలి, వివాదాలను నివారించేందుకు ప్రయత్నించే ఒప్పందాలు, అలాంటి వివాదాలను సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా పరిష్కరించే మధ్యవర్తిత్వ ప్రక్రియలు, మధ్యవర్తిత్వ తీర్పులను ఊహించదగిన రీతిలో అమలు చేసే న్యాయస్థానాలు.. ఈ మూడూ ఒకదానితో ఒకటి పెనవేసుకుని పనిచేయాలి. అయితే, సూక్ష్మమైన సర్దుబాట్ల ద్వారా, దేశ వాణిజ్య, పెట్టుబడుల సంబంధాలకు మద్దతిచ్చే మౌలిక సదుపాయంలో వాణిజ్య మధ్యవర్తిత్వాన్ని ఒక అంతర్భాగంగా భారత్ మార్చగలదు. ఈ సమతుల్యతను భారత్ సరిగ్గా సాధించగలిగితే, పెరుగుతున్న దాని ఒప్పందాల నెట్‌వర్క్ కేవలం మార్కెట్లను తెరవడంకంటే మించిన పనిని చేయగలదు. అంతర్జాతీయ వ్యాపారాలు నమ్మకంగా కట్టుబడగల, తమ నిబద్ధతలు విఫలమైనా వివాదాలు విశ్వసనీయంగా, సమర్థవంతంగా పరిష్కారమవుతాయన్న భరోసా ఇచ్చే ఒక న్యాయపరిధిగా భారత్‌నే నిలబెట్టగలదు. ■



కేవలం నిమిషాల్లో తీసుకోగలిగే ఒక చిన్న నిర్ణయం కోసం కొన్నిసార్లు ఆలోచిస్తూనే గంటల కొద్దీ సమయాన్ని వృథా చేస్తుంటాం. అతిగా ఆలోచించడం చాలా సాధారణమైన, సులువైన విషయాలను కూడా ఎంతో సంక్లిష్టంగా మార్చేస్తుంది. భయం, సందేహాల వల్ల సమయం వృథా చేయడం కంటే.. వెంటనే ప్రశాంతంగా ఒక నిర్ణయం తీసుకొని ముందడుగు వేయడమే మనసుకు ప్రశాంతతను ఇస్తుంది. ఆలోచన అవసరమే.. కానీ అతిగా ఆలోచించడం మాత్రం అవకాశాలను చంపేస్తుంది. ఆలోచనకు హద్దు పెడితేనే.. జీవితానికి దారి కనిపిస్తుంది.

-మహాదేవ

## వింతల్లో వింతలు

### రాయి అనుకున్నాడు.. దంతం తేలింది!



కాలువలో ఏదో వింత రాయి కనిపించింది. శాస్త్రవేత్త కాస్త ఆసక్తిగా దగ్గరకు వెళ్లి చూస్తే.. అది రాయి కాదు, వేల ఏళ్ల నాటి మాస్టోడాన్ దంతం! కాలిఫోర్నియాలోని ఓ క్రీక్‌లో సర్వే చేస్తున్న బ్రిజిడ్ లించ్‌కు ఈ అరుదైన ఫాసిల్ దొరికింది. తొలుత విచిత్రంగా ఉన్న రాయిలా కనిపించిన ఈ మోలార్.. ఏకంగా 50 వేలనుంచి లక్ష సంవత్సరాల నాటిదై ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. పైగా ఇప్పటికీ అద్భుతమైన స్థితిలో ఉందట. అసలు ట్విస్ట్ ఏంటంటే.. ఆ దంతం ఊడిన పురాతన మాస్టోడాన్ మిగతా ఎముకలు కూడా అక్కడే పాతిపడి ఉండొచ్చట!

# రోజూ నడక.. ఆరోగ్యానికి అమృతం

## నిత్యం 30 నిమిషాల నడకతో ఎన్నో రోగాలకు దూరం

ఆరోగ్యంగా ఉండాలంటే ఎంతలా వ్యాయామం చేయాలో తెలియక చాలా మంది సందిగ్ధపడుతుంటారు. అయితే నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల నడక చేయడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, మధుమేహం, బీపీ, ఊబకాయం వంటి అనేక సమస్యల నుంచి కాపాడుతుంది. నడక అనేది అందరికీ అందుబాటులో ఉండే, సులభమైన మరియు ఖర్చు లేని వ్యాయామం.



## నడక వల్ల కలిగే ప్రయోజనాలు



**గుండె ఆరోగ్యం**
గుండె పనితీరును మెరుగుపరచి, రక్త ప్రసరణను పెంచుతుంది.



**మధుమేహం నియంత్రణ**
రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేస్తుంది.



**ఊబకాయం తగ్గింపు**
క్యాలరీలను ఖర్చు చేసి బరువును నియంత్రిస్తుంది.



**ఎముకలు, కండరాల బలం**
ఎముకలను దృఢంగా చేసి, కండరాలను శక్తివంతం చేస్తుంది.



**మానసిక ప్రశాంతత**
ఒత్తిడిని తగ్గించి, మంచి నిద్రకు సహాయపడుతుంది.

## నిపుణులు ఏమంటున్నారు?

"ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల నడక చేయడం వల్ల శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది, గుండె ఆరోగ్యం బలంగా ఉంటుంది. బరువు నియంత్రణకు, మానసిక ఉల్లాసానికి కూడా దోహదపడుతుంది."

## ఎలా నడవాలి?

ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం నడవడం అలవాటు చేసుకోవాలి.
సౌకర్యవంతమైన చెప్పులు ధరించాలి.
మొదట 10 నిమిషాలతో ప్రారంభించి, క్రమంగా 30 నిమిషాల వరకు పెంచాలి.
సాధ్యమైనంత వరకు స్పీడుగా గాలిలో నడవాలి.
నీళ్లు తాగడం మర్చిపోవద్దు.

**నడక మొదలు పెట్టండి..**
**ఆరోగ్యాన్ని కాపాడుకోండి..**



## వర్షాకాలంలో జాగ్రత్త.. డెంగ్యూ, వైరల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలంలో దోమల ద్వారా వచ్చే డెంగ్యూ, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి వైరల్ జ్వరాలు పెరిగే అవకాశం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీరు నిల్వ లేకుండా చూసుకోవడం, దోమల నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా ఈ జ్వరాల నుంచి రక్షణ పొందవచ్చని సూచిస్తున్నారు.



**దోమల నివారణే.. జ్వరాల నివారణ**

### ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఇంటి చుట్టూ నీరు నిల్వ లేకుండా చూడాలి.
దోమతెరలను శుభ్రంగా ఉంచాలి.
పూర్తి చేతుల దుస్తులు, ప్యాంట్లు ధరించాలి.
దోమల కాయిల్స్, స్ప్రే వాడాలి.
జ్వరం లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
ఆరోగ్యమే మహాభాగ్యం.. జాగ్రత్తలతో మనల్ని మనం కాపాడుకుందాం..

## న్యూజీలాండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు కీ ప్లేయర్లకు రెస్ట్.. హెడ్ కోచ్ గంభీర్ హింట్




**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజీలాండ్ తో టెస్టు సిరీస్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది టీమిండియా. అందులో భాగంగా ఇప్పటి నుంచే సన్నాహాలు మొదలుపెట్టింది. త్వరలో టీ20, వండే, టెస్టు సిరీస్ లు ఉన్న క్రమంలో.. టెస్టు సిరీస్ కే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు హెడ్ కోచ్ గంభీర్ చెప్పారు.

అందులో భాగంగా లిమిటెడ్ ఓవర్ల మ్యాచ్ నుంచి కీలక ప్లేయర్లకు రెస్టు ఇవ్వనున్నట్లు హింటిచ్చారు. టెస్టుకు ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పిన గంభీర్.. ప్లేయర్లకు రెస్టు ఇచ్చే అంశం న్యూజీలాండ్ సిరీస్ కేనని క్రీడావర్గాలు భావిస్తున్నాయి.

న్యూజీలాండ్ తో 12 మ్యాచ్ ల టూర్ కు ఇండియా సిద్ధమవుతోంది. మొత్తం ఐదు వండేలలో చివరి వండే ముగిసిన మూడు రోజులకే టెస్టు సిరీస్ ప్రారంభమవుతుంది. తొలి టెస్టు వెల్లింగ్టన్ లో నవంబర్ 19 నుంచి మొదలవుతుంది. దీంతో ప్లేయర్లపై వర్క్ లోడ్ పడకుండా.. టీ20, వండేల నుంచి రెస్టు ఇచ్చేందుకు ప్లాన్ చేస్తున్నట్లు హింట్ ఇచ్చారు గంభీర్.

### ప్రపంచపటాలు పరిశీలించండి

టెస్టు సిరీస్ కు ముందు కీలక ప్లేయర్లైన శుబ్మన్ గిల్, కేఎల్ రాహుల్, యశస్వీ జైశ్వాల్, బుమ్రా, సిరాజ్, జడేజా, నితీష్ కుమార్ రెడ్డి లు టెస్టు సిరీస్ లో కీలకంగా కానున్నారు. చివరి వండే, మొదటి టెస్టుకు కేవలం రెండు రోజుల గ్యాప్ మాత్రమే ఉండటంతో టీ20, వండేల నుంచి వీరిని దూరంగా ఉంచనున్నట్లు గంభీర్ చెప్పిన మాటల ద్వారా తెలుస్తోంది. ఇండియాలో ఎంత మంది కొత్త వాళ్లు వస్తున్నా.. టెస్టు క్రికెట్ కే అధిక ప్రాధాన్యమని చెప్పడం గంభీర్ మాటల ద్వారా తెలుస్తోంది. ఇండియన్ ప్లేయర్లు దాదాపు అన్ని ఫార్మాట్లను మేనేజ్ చేయగల కెపాసిటీ ఉండటంతో.. అవసరమైన సమయంలో ప్లేయర్లకు బాధ్యతలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

ఇండియా ప్రధాన్య టెస్టు క్రికెట్. టీ20కి ఎంత క్రేజ్ ఉన్నప్పటికీ.. ఇండియా దృష్టి టెస్టులపైనే ఉంటుందన్నారు. టీ20లో బలమైన దేశం.. క్రికెట్ లో బలమైన దేశం కాలేదని.. టెస్టులో బలంగా ఉంటేనే అసలైన క్రికెట్ జట్టు అని చెప్పుకొచ్చారు.

## వాళ్లిద్దరూ ప్రపంచ కప్ గెలవాలని దేశం మొత్తం కోరుకుంటోంది: రింకూ సింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత్ తరఫున ఆడాలని దేశం మొత్తం కోరుకుంటోందని టీమిండియా బ్యాటర్ రింకూ సింగ్ అన్నాడు. ఇద్దరూ దిగ్గజ ఆటగాళ్లని పేర్కొన్న అతడు.. 2027 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిస్తే అది దేశానికే కాకుండా కోహ్లీ, రోహిత్‌కు కూడా ఎంతో ప్రత్యేకమైన సందర్భమవుతుందని చెప్పాడు.

"విరాట్ భయ్యా, రోహిత్ భయ్యా ఇద్దరూ లెజెండ్స్. వాళ్లు ప్రపంచకప్‌లో ఆడాలని నా ఒక్కడి కోరిక కాదు.. దేశం మొత్తం కోరుకుంటోంది. వాళ్లు జట్టులో ఉండి భారత్‌ను ప్రపంచకప్ విజేతగా నిలిపితే ఎంతో గొప్పగా ఉంటుంది. అది వాళ్లకు చివరి ప్రపంచకప్ కావచ్చేమో. 2011 తర్వాత భారత్ వన్డే ప్రపంచకప్ గెలవలేదు. అందుకే వాళ్లిద్దరూ జట్టుతో ఉండి ట్రోఫీ గెలిస్తే ఎంతో ప్రత్యేకం" అని జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రింకూ చెప్పాడు.

ఐపీఎల్ 2023లో గుజరాత్ టైటాన్స్‌పై వరుసగా ఐదు సిక్సర్లు బాదడంతో రింకూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. అయితే తనను కేవలం ఆ ఐదు సిక్సర్లతోనే గుర్తించకూడదని అతడు అంటున్నాడు. భారత్ తరఫున ప్రపంచకప్ గెలవడంలో భాగస్వామి కావడమే ప్రస్తుతం తన ప్రధాన లక్ష్యమని చెప్పాడు. బ్యాటింగ్‌తో జట్టుకు ఉపయోగపడుతూ మరిన్ని ప్రపంచకప్ విజయాల్లో భాగం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. ఇక తాను కేవలం టీ20 ఆటగాడిననే అభిప్రాయాన్ని కూడా రింకూ ఖండించాడు. దేశవాళీ క్రికెట్‌లో వన్డేలు, నాలుగు రోజుల మ్యాచుల్లోనూ ఆడుతున్నానని చెప్పాడు. భారత్ తరఫున టెస్టుల్లో అరంగేట్రం చేయాలన్నది తన కల అని వెల్లడించాడు. ప్రస్తుతం భారత్ తరఫున ఒక్క ఫార్మాట్‌లోనే ఆడుతున్నా.. మూడు ఫార్మాట్లలోనూ రాణించగలనని విశ్వాసం వ్యక్తం చేశాడు. కెప్టెన్సీపై కూడా రింకూ స్పందించాడు. యూపీ లీగ్‌లో తన జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి టైటిల్ గెలిచానని గుర్తుచేశాడు. గత సీజన్‌లో ఐపీఎల్‌లో వైస్ కెప్టెన్‌గా ఉన్నానని చెప్పాడు. అజింక్య రహానే, సూర్యకుమార్ యాదవ్ వంటి ఆటగాళ్ల నుంచి నాయకత్వ లక్షణాలు నేర్చుకుంటున్నానని తెలిపాడు. కెప్టెన్సీలో ఇంకా ఎదగాల్సి ఉందని పేర్కొన్నాడు.

## ఆసియా క్రీడల్లో మీరాబాయి చానుకు రజతం.. 28 ఏళ్ల భారత పతక నిరీక్షణకు తెర

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ వెయిట్?లిఫ్టర్ మీరాబాయి చాను చరిత్ర సృష్టించారు. జపాన్ వేదికగా జరుగుతోన్న ఆసియా క్రీడల్లో వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో ఆమె రజత పతకం సాధించారు. మహిళల 49 కేజీల విభాగంలో పోటీపడ్డ ఆమె స్నాచ్‌లో 87 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కేజీలతో కలిపి మొత్తం 198 కేజీల బరువును ఎత్తి రెండో స్థానంలో నిలిచారు. తద్వారా ఆసియా క్రీడల్లో పతకం సాధించాలనే తన చిరకాల వాంఛను నేరవేర్చుకున్నారు. మీరాబాయి చానుకు కూడా ఆసియా క్రీడల్లో ఇదే తొలి మెడల్. ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్, కామన్వెల్త్ గేమ్స్‌లో ఇప్పటికే పతకాలు సాధించిన మీరాబాయి చానుకు ఇప్పటివరకు ఆసియా క్రీడల పతకం ఒక్కటే లోటుగా ఉండేది. తాజా రజతంతో ఆమె తన పతకాల కలెక్షన్‌ను సంపూర్ణం చేసుకున్నారు. దీంతో పాటు వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో 28 ఏళ్ల భారత పతక నిరీక్షణకు మీరాబాయి చాను తెరదించారు. 1998 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో భారత దిగ్గజ వెయిట్?లిఫ్టర్ కర్ణం మల్లేశ్వరి కాంస్య పతకం సాధించారు. ఆ తర్వాత వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ఇండియాకు పతకం రాలేదు. తాజా విజయంతో 28 ఏళ్ల భారత పతక నిరీక్షణకు చాను తెరదించారు.





## 'జనవరి 12 విడుదల ' ఇంటర్వెల్, క్లైమాక్స్ ఇదే... అనిల్ రావిపూడి ఖాతాలో 10 వ హిట్ పక్కానా...



తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఇప్పటివరకు కనివిని ఎరుగని రీతిలో చాలామంది దర్శకులు సినిమాలను చేస్తూ ముందుకు సాగుతున్నారు. రాజమౌళి లాంటి దర్శకుడు వరుసగా 12 సక్సెస్ లతో ముందుకు దూసుకెళ్తుంటే అనిల్ రావిపూడి తొమ్మిది విజయాలను తన ఖాతాలో వేసుకొని పదో సక్సెస్ కోసం ప్రయత్నం చేస్తున్నాడు. ప్రస్తుతం వెంకటేష్ – కళ్యాణ్ రామ్ లను హీరోలుగా పెట్టి 'జనవరి 12 విడుదల' అనే సినిమాని చేస్తున్నాడు. ఈ సినిమా 2027 సంక్రాంతి కానుకగా జనవరి 12వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇక ఈ సినిమాతో మరోసారి అనిల్ రావిపూడి కామెడీనే నమ్ముకొని ముందుకు సాగుతున్నాడు. అయితే ఈ సినిమాలో ఎమోషన్స్ ను సైతం బ్యాలెన్స్ చేస్తూ ప్రేక్షకులను కన్నీళ్లు పెట్టించడమే లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నట్టుగా తెలుస్తుంది. ఇంటర్వెల్, క్లైమాక్స్ సన్నివేశాలు



ప్రేక్షకులందరిని కంటతడి పెట్టేలా డిజైన్ చేశారట. క్లైమాక్స్ అయితే భారీ ఎమోషనల్ సన్నివేశాలతో పాటు యాక్షన్ సీక్వెన్స్ కి కూడా పెద్దపీట వేసినట్టుగా తెలుస్తుంది... ఇంటర్వెల్ లో వెంకటేష్ కళ్యాణ్ రామ్ కు మధ్య ఒక పెద్ద గొడవ జరుగుతుందట. దాంతో వాళ్లిద్దరు విడిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆ సందర్భంలో సినిమా చూసే ప్రతి ప్రేక్షకుడికి ఆటోమేటిగ్గా కండ్లల్లో నుంచి కన్నీళ్ళు వస్తాయనే వార్తలైతే వస్తున్నాయి. ఇక క్లైమాక్స్ సీన్ లో హీరోలిద్దరు కలిసి ఫైట్ చేసినప్పటికి ప్రేక్షకుల్లో తెలియని ఒక గూస్ బంప్స్ వచ్చే సన్నివేశాలను కూడా ఇందులో పొందుపరిచినట్టుగా తెలుస్తుంది.

ఇక ఏదేమైనా కూడా కామెడీతో పాటు ఈసారి ఎమోషనల్ గా కూడా ప్రేక్షకులను కనెక్ట్ చేయాలనే ఉద్దేశ్యంతో అనిల్ రావిపూడి చాలా స్ట్రాంగ్ డిసిజన్ తీసుకున్నట్టుగా తెలుస్తుంది. ఈ సినిమాతో తన ఖాతాలో పదో విజయాన్ని వేసుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాడు. ఇక ఈ సంవత్సరం 'మన శంకర్ ప్రసాద్' సినిమాతో ప్రేక్షకులను అలరించిన ఆయన వచ్చే ఏడాది 'జనవరి 12 విడుదల' సినిమాతో మరోసారి ప్రేక్షకులను ఎంటర్ టైన్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాడు... అనిల్ రావిపూడి పేరు చెబితే చాలు ప్రేక్షకులు ఆటోమేటిగ్గా థియేటర్ కి వచ్చేస్తారు. ముఖ్యంగా అనిల్ ఫ్యామిలీ ఆడియన్స్ ను టార్గెట్ చేసిన ప్రతిసారి సక్సెస్ లను సాధిస్తుండడం విశేషం...

ఇప్పటికే స్టార్ హీరోలు సైతం అతనితో సినిమాలు చేయడానికి ఇంట్రెస్ట్ చూపిస్తున్న కూడా ఆయనకున్న కమిట్ మెంట్ల ప్రకారం సినిమాలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నాడు. తమిళ్ స్టార్ హీరో అయిన విజయ్ సైతం 'జన నాయకుడు' సినిమాకి దర్శకుడిగా మొదట అనిల్ రావిపూడి నే అనుకున్నారట. అనిల్ ను పిలిపించుకొని మరి మూవీ చేయమని అడిగారట. కానీ అనిల్ కి ఇతర హీరోలతో ఉన్న కమిట్మెంట్స్ వల్ల నేను ఆ సినిమా చేయలేనని చెప్పాడట. అనిల్ రావిపూడి డైరెక్షన్లో బాలయ్య హీరోగా వచ్చిన 'భగవంత్ కేసరి' మూవీ రీమేక్ గా 'జన నాయకుడు' సినిమా తెరకెక్కిన విషయం మనకు తెలిసిందే. ఇక ప్రస్తుతం విజయ్ తమిళనాడు సీఎంగా పదవి బాధ్యతలను కొనసాగిస్తున్నాడు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965